తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 4
సంచిక : 34
పేజీలు - 8
వెల- రూ 5:00
prajamantalu.com

# ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ఆదివారం 25, జూన్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటమి



2లో..

# మెట్రో రెండోదశ విస్తరణను అనుమతించండి

- అవసరమైన ఆర్థిక సాయం కూడా అందించండి
- పట్టణ పేదలకు ప్రత్యేక ఉపాధి కార్యక్రమం చేపట్టాలి
- కేంద్రమంత్రి హర్దీప్‌పింగ్ పూరికి కెటిఆర్ వినతి



న్యూఢిల్లీ,జూన్24 : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండవ దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కేంద్రాన్ని మంత్రి కేటీఆర్ కోరారు. లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు 5 కిలోమీటర్ల మెట్రో లైన్‌కు ఆమోదం తెలిపి, ఆర్థిక సహాయం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ హర్దీప్ సింగ్ పూరికి రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శ్రాఖ మంత్రి కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున పలు అంశాలకు సంబంధించి విజ్ఞప్తులు చేశారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాదిరి పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా ఉపాధి హామీ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకురావాలని మరొక ప్రతిపాదనను కేటీఆర్ సమర్పించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగర పరిధిలో చేపట్టిన లింకు రోడ్డుల కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయని ఇప్పటికే 22 మిస్సింగ్ లింక్ రోడ్లను పూర్తి చేశామని, మరో 17 రోడ్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని కేటీఆర్ తెలిపారు. ఇదేవిధంగా అవుటర్ రింగ్ రోడ్డు నుంచి పరిసర పురపాలికలకు మొత్తం 104 అదనపు కారిడార్లను నిర్మించేందుకు దాదాపు రూ. 2,400 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 800 కోట్లను ఈ ప్రాజెక్టు కోసం కేటాయించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముఖ్యంగా ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేయడంతో పాటు చెత్తను తరలించేందుకు అవసరమైన వాహనాల ప్రోక్యూర్‌మెంట్ కోసం, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల నిర్మాణం వంటి వివిధ కార్యక్రమాల కోసం స్వచ్ఛ భారత్ మిషన్ లేదా ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కింద రూ. 400 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. రూ. 3,050 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి 15 శాతం నిధులను కేంద్రం అందించాలని ఇందుకోసం రూ. 450 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర పరిధిలో చేపడుతున్న ఎస్‌టీపీల నిర్మాణ ఖర్చు దాదాపు రూ. 3,722 కోట్లు అని ఇందులో కనీసం 20 శాతం రూ. 744 కోట్లను కేంద్ర ప్రభుత్వం అందించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిర్దేశిరచిన సిటిజన్ సెంట్రిక్ రిఫార్మ్స్ కింద బయో మైనింగ్, మానవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను చేపట్టిందని వీటి అన్నింటి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురపాలికల్లో చేపడుతున్న కార్యక్రమాలకు మొత్తంగా రూ. 3,777 కోట్ల ఖర్చు అవుతుందని ఇందులో రూ. 750 కోట్లను కేంద్రం ఆర్థిక సాయం చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన శానిటేషన్ హబ్ కార్యక్రమంపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రశంసలు కురిపించారు. ఇలాంటి వినూత్నమైన ఆలోచనలతో కూడిన శానిటేషన్ హబ్ వల్ల పురపాలక అభివృద్ధిలో అనేక సవాళ్లకు సమాధానం దొరుకుతుందన్నారు. ఈ అంశం పైన తెలంగాణ రాష్ట్రం తన నమూనాను, ఆలోచనలను పంచుకోవాలని హర్దీప్ సింగ్ పూరి కోరారు. త్వరలోనే తన మంత్రిత్వ శాఖ ఢిల్లీలో ఏర్పాటు చేసే సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలతో కూడిన ప్రజెంటేషన్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం పురపాలక శాఖ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఎస్ఆర్‌డీపీ, లింకు రోడ్లు, పారిశుద్ధ్య రంగంలో చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి అర్బన్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించేందుకు హైదరాబాద్ రావాలని కేంద్ర మంత్రిని కేటీఆర్ ఆహ్వానించారు. మంత్రి కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున పలు అంశాలకు సంబంధించిన విజ్ఞప్తులను హర్దీప్ సింగ్ పూరికి అందించారు.

# పోడు పట్టాలకు ముహూర్తం ఖరారు

- 30న ఆసిఫాబాద్‌లో ప్రారంభించనున్న కెసిఆర్



హైదరాబాద్,జూన్24 : దశాబ్ది ఉత్సవాలు ముగిసినా పోడు పట్టాల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది. అదిగో ఇదిగో అంటున్నారే తప్ప ఇవ్వడం లేదన్న నిరసనలు వచ్చాయి. విపక్షాలు కూడా ప్రభుత్వ తీరును ఎండగట్టాయి. అయితే అనివార్య కారణావల్ల ఆసల్యం అయినా పట్టాల పంపిణీ బరాబర్ అంటూ ప్రకటన వచ్చేసింది. రాష్ట్రంలో గిరిజనులకు ఈ నెల 30 నుంచి గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో జరిగే కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొని, పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు జిల్లాలు, నియోజకవర్గాల్లో అదే రోజు పోడుపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్నారు. ఈ నెల 24 నుంచే పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రకటించినప్పటికీ అనివార్య కారణాలతో ప్రభుత్వం ఈ నెల 30వ వాయిదా వేసింది. జాతీయ ఎన్నికల కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తుండడం, పర్యటనలో భాగంగా రెండురోజులుగా జిల్లా కలెక్టర్లకు శిక్షణాతరగుతులు నిర్వహిస్తున్నది. అదే సందర్భం లో ఈ నెల 29న బక్రీద్ పండుగ కూడా ఉండడం.. వీటన్నిటి నేపథ్యంలో ప్రకటించిన కార్యక్రమాన్ని జూన్ 30కి వాయిదా వేయాలని నిర్ణయించింది. ఆసిఫాబాద్ పర్యటన సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్ కలెక్టరేట్, జిల్లా పోలీసుల ప్రధాన కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఇపోతే ఇప్పటికే జిల్లాల వారీగా పట్టా భూమలు పంపిణీకి సంబంధించి జాబితాను సిద్ధం చేశారు. ఏయే జిల్లాలో ఎంతన్నది లెక్క తేల్చారు.

# తెలంగాణ బిజెపిలో గందరగోళం

- రాష్ట్రపార్టీ తీరుతో అధిష్టానంలో అసహనం
- హుటాహుటిన ఢిల్లీకి కిషన్ రెడ్డి పయనం
- ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న ఈటెల, రాజగోపాల్ రెడ్డిలు
- నేడు హైదరాబాద్ పర్యటనకు నడ్డా రాక





హైదరాబాద్,జూన్24 : తెలంగాణ బిజెపిలో గందరగోళం కనిపిస్తోంది. ఉన్నవాళ్లు ఉంటారా అన్న అనుమానాలు అధిష్టానాన్ని తొలచి వేస్తున్నాయి. మరోవైపు మొన్నటి వరకు ఊపు కనిపించిన పార్టీలో నైరాశ్యం తాండవిస్తోంది. ఈ క్రమంలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు అదిష్టానం రంగంలోకి దిగింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సడెన్‌గా ఢిల్లీ వెళ్లారు. చాలా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన ఆయన్ని అధినాయ కత్వం ఉన్నఫళంగా ఢిల్లీ రావాలని పిలుపునిచ్చింది. దీంతో షెడ్యుల్డ్ కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని ఆయన ఢిల్లీ వెళ్లారు. ఇప్పటికే అక్కడ ఈటల రాజేందర్, రాజగోపాల్ రెడ్డి ఉండనే ఉన్నారు. మరోవైపు నేడు నాగర్ కర్నూలు పర్యటన కోసం పార్టీ అధ్యక్షుడు నడ్డా హైదరాబాద్ వస్తున్నారు. దీంతో బీజేపీలో ఏం జరుగుతుందో అన్న చర్చ మొదలైంది. తెలంగాణ బీజేపీలో జరుగుతున్న పరిస్థితులను చక్కదిద్దేం దుకు బీజేపీ అధిష్టానం రంగంలోకి దిగింది.

# కుమారుడిని చంపి ఉరేసుకున్న మహిళ

హైదరాబాద్,జూన్24 : ఓ మహిళ తన కుమారుడిని చంపి, అనంతరం ఉరేసుకుంది. ఈ విషాద ఘటన హైదరాబాద్ నగరంలోని ఫిలింనగర్‌లో వెలుగు చూసింది. శిరీష(22) అనే మహిళకు నాలుగేండ్ల క్రితం విశ్వనాథ్ అనే వ్యక్తితో వివాహమైంది. ఈ దంపతులకు మూడేండ్ల వయసున్న కుమారుడు మనీష్ ఉన్నాడు. అయితే శుక్రవారం రాత్రి శిరీష తన కుమారుడికి ఇంట్లోనే ఉరేసింది. అదే ఇంట్లో శిరీష ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికీ తరలించారు. అయితే భర్త, అత్తామామల వేధింపుల వల్లే శిరీష ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# కేఎంసీలో వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం వదంతులు

- మైగ్రేన్ కారణంగా నిద్రమాత్రలు వేసుకున్న పీజీ విద్యార్థిని, ఓవర్డోస్ కావడంతో తీవ్ర అస్వస్థత..
- ఆత్మహత్యాయత్నం అనే ప్రచారాన్ని కొట్టిపారేసిన కేఎంసీ ప్రిన్సిపాల్




హనుమకొండ జూన్ 24 (ప్రజామంటలు) : వరంగల్ కేఎంసీ వైద్య విద్యార్థిని కుమారి లాస్య అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. మెడికో ప్రీతి సూసైడ్ ఘటన మరువకముందే మరో మెడికో అస్వస్థతకు గురై నట్లు వదంతులు వ్యాపించాయి. వివరాల్లోకివెళ్తే.. పెడియాట్రిక్ విభాగంలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థిని లాస్య తనకున్న మైగ్రేన్ నొప్పి కారణంతో మెటాప్రోనాల్ మాత్రలు వేసుకుంది. మైగ్రేన్ కంట్రోల్ కాకపోవడంతో మరో డోస్ టాబ్లెట్ వేసుకోగా అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమె ఎమ్ జి ఎమ్ లో చికిత్స పొందుతున్న క్రమంలో ఈ విషయం వైరల్ అయింది. ఈ ఘటనపై కేఎంసీ ప్రిన్సిపల్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. మెడికో విద్యార్థినిది ఆత్మహత్యాయత్నం కాదని స్పష్టం చేశారు. విద్యార్థిని లాస్య చాలా కాలంగా మైగ్రేన్‌తో బాదపడు తోందని.. దానికి సంబంధించి మెడిసిన్ వాడుతున్న క్రమంలో ఈరోజు ఉదయం మైగ్రేన్‌కు సంబంధించిన మెడిసిన్‌ను రెండు సార్లు వేసుకోవడంతో తోటి స్నేహితులు ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు తెలిపారు. సదరు విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి బాగుందని సీనియర్ విద్యార్థులు వేధింపులు ఏమీ లేవని, అనవసర ప్రచారాన్ని నమ్మివద్దని మోహన్ దాస్ తెలిపారు. ఎంజీఎం సూపరింటెండెంట్ వలపదాసు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మైగ్రేన్ వల్ల మెడిసిన్ వేసుకున్నట్లు మెడికో తెలిపారని, విద్యార్థిని పరిస్థితి బాగుందని తెలిపారు. కేవలం అబ్జర్వేషన్ కోసమే ఆస్పత్రిలో ఉంచినట్లు చెప్పారు.

# షాద్‌నగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

## ప్రమాద ఘటనపై మంత్రి నిరంజన్ రెడ్డి దిగ్భ్రాంతి

రంగారెడ్డి,జూన్24 : అతివేగం ముగ్గురు ప్రాణాలను బలిగొంది. జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ రహదారిపై అతివేగంగా వచ్చిన బొలెరో ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే చనిపోగా మరో ఇద్దరిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతులు వనపర్తి జిల్లా కోడేరు మండలం మైలారం గ్రామానికి చెందిన అశోక్(28), శంకర్32), రవి (30) గా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.హైదరాబాద్‌లో గొర్రెలను అమ్ముకుని తిరిగివస్తున్న క్రమంలో షాద్‌నగర్ అనూస్ జంక్షన్ వద్ద వాహనం అదుపు తప్పి లారీని ఢీకొని ముగ్గురు చనిపోయిన సంఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా పానుగల్ మండలం మందాపూర్‌కు చెందిన బొలెరో డ్రైవర్ అశోక్, తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన శంకర్, నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నార్యా నాయక్‌కు చెందిన రవిలు ఈ ప్రమాదంలో మరణించారు. మరణించిన వారి కుటుంబాలకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతులు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## ప్రజానాడి





## రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ కు ఓటమి

కాంగ్రెస్‌ను జాకీ పెట్టి లేపుతున్న కెసిఆర్

మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో విజయశాంతి

వివరాలు 2లో..

# నేడు ఢిల్లీకి తెలంగాణ కాంగ్రెస్ నేతలు

## రాహుల్‌తో భేటీ కానున్న పొంగులేటి, జూపల్లి

హైదరాబాద్,జూన్24 : తెలంగాణ కాంగ్రెస్ నేతలకు హైకమాండ్ నుంచి పిలుపు వచ్చింది. ఆదివారం సాయంత్రం టి.కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వెళ్లనున్నారు. పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలతో పాటు ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్యనేతలకు ఆహ్వానించారు. సోమవారం రాహుల్ గాంధీతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి , జూపల్లి కృష్ణారావు భేటీ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలకు హైకమాండ్ నుంచి పిలుపువచ్చింది. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరికపై ఫుల్ క్లారిటీ వచ్చేసింది. ఈ నెలాఖరున పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. అయితే.. ఢిల్లీలో కాకుండా ఖమ్మంలో భారీ బహిరంగ సభ పెట్టి పొంగులేటి చేరబోతున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ కీలక నేతలు స్పష్టత ఇచ్చారు. మరోవైపు.. నాగర్ కర్నూల్ వేదికగా జరిగే సభలో జూపల్లి, కాంగ్రెస్ కండువాలు కప్పుకోనున్నారు. తెలంగాణలో జులై 11 నుంచి యూత్ కాంగ్రెస్ ప్లీనరీ నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ఈ సమావేశం జరగనుంది. కేందప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ నేతలు చర్చిస్తామన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు

- పైలట్ ప్రాజెక్టుగా కుట్టు శిక్షణా కేంద్రాలు
- కుట్టు మిషన్లను పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి

జనగామ,జూన్24 : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, పథకాలను సైతం అమలు చేస్తున్నదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా ఈ కుట్టు మిషన్ల శిక్షణను సీఎం కేసీఆర్‌ను ఒప్పించి పైలట్ ప్రాజెక్టుగా తీసుకువచ్చినట్లు చెప్పారు. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో కుట్టు మిషన్ల శిక్షణను ప్రారంభించనున్నట్లు చెప్పారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మహిళలకు రెండో విడత కుట్టు శిక్షణ ముగియగా.. వారికి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళల పక్షపాతి సీఎం కేసీఆర్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు.

# అధికారంలోకి రాగానే శాంతిభద్రతలకు పెద్దపీట

## రాష్ట్రంలో అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగాయి

## గంజాయి మాఫియాలో రాష్ట్రం నెంబర్ వన్‌లో ఉంది

## నెల్లూరు జిల్లా యువగళం పాదయాత్రలో లోకేశ్



నెల్లూరు,జూన్24 రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, టిడిపి అధికారంలోకి రాగానే వాటిని సరిచేస్తామని టిడిపి నేత లోకేష్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఒక్క నిమిషంలో లా అండ్ ఆర్డర్ సెట్ రైట్ చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ తమ ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. వైసీపీ నేతలపై వైసీపీ నేతలే దాడులు చేసుకునే విచిత్రమైన పరిస్థితి నెలకొందన్నారు. దాడులు, దొంగతనాలు, అత్యాచారాలు, హత్యలు, గంజాయి మాఫియాలో నెంబర్ వన్‌లో ఉన్నామని లోకేష్ పేర్కొన్నారు. వీటిని కఠినంగా అణచివేస్తామని అన్నారు. టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. ప్రస్తుతం సూళ్ళూరుపేట నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న లోకేష్ వజ్జావారిపాలెం క్యాంపు సైటులో చర్చి ఫాస్టర్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ.. 2014లో రాష్ట్ర విభజన ఏపీ ప్రజల కోరికకాదని... కట్టుబట్టలతో బయటకి గెంటేశారని అన్నారు. కులమతాలకు అతీతంగా చంద్రబాబు పాలన సాగించారని తెలిపారు. రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో పాలన మొదలైనా, ఎవరికీ ఇబ్బందులు లేకుండా పరిపాలించారని గుర్తుచేశారు.జగన్ ప్రభుత్వంలో చర్చిలపైనా దాడులు జరిగాయన్నారు. పెళ్లికానుక, పండుగ కానుకలు ఎత్తేశారని మండిపడ్డారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. అందరూ కలిసి పనిచేస్తేనే రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. గతంలో తాము చేసిన కార్యక్రమాలు ప్రజలకు చెప్పుకోలేకపోయామని.. అందుకే ఓడిపోయామన్నారు. టీడీపీ హయాంలో అనేక స్కీమ్‌లు తెచ్చామని.. ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య ఎత్తేశారని... పరిశ్రమలు వచ్చే పరిస్థితి లేదని లోకేష్ అన్నారు. జగన్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని పక్కదారి పట్టించిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికీ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుబాటులోకి తెస్తామన్నారు. ఫాస్టర్లు అందరికీ బటన్ నొక్కితే ఐడీకార్డులు వచ్చేలా చూస్తామన్నారు. ఫాస్టర్లకి గౌరవవేతనం అందిస్తామని హామీ ఇచ్చారు. మీరు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదు... ప్రభుత్వమే మీ చుట్టూ తిరిగేలా చేస్తామమని యువనేత అన్నారు. చంద్రబాబు బరయల్ గ్రౌండ్స్‌కు రూ.52వేల కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. చర్చి నిర్మాణాలకు టీడీపీ సహాయం చేసిందని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం అన్ని కార్పోరేషన్లులానే క్రిష్టియన్ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అంటే చట్టాలు అతిక్రమించే వారికి భయమన్నారు. చట్టాలు కొందరికి చుట్టాలుగా మారాయని.. అందరికీ సమానంగా చట్టాలు అమలయ్యేలా చూస్తామని స్పష్టం చేశారు. చర్చిలపైన వైసీపీ జెండాలు ఎగురవేస్తారని.. వ్యతిరేకంగా మాట్లాడితే ఫాస్టర్లను చర్చిల్లోకి రానివ్వరన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమని.. చంద్రబాబు సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

# రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటమి

## కాంగ్రెస్‌ను జాకీ పెట్టి లేపుతున్న కెసిఆర్

## మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో విజయశాంతి



మేడ్చల్,జూన్24 : రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి సీట్లు తగ్గుతున్నాయని సంకేతాలు వస్తున్నాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీని లేపే ప్రయత్నంలో ముఖ్యమంత్రి కేసీఆర్ బీజీగా ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాకపోయి ఉంటే బాగుండేదని సైతం కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి నెగ్గిన నేతలను తమలో విలీనం చేసుకునే దిశగా కేసీఆర్ వ్యూహాలు పన్నుతున్నారని ఆమె ఆరోపించారు. త్వరలో జరగ బోయే ఎన్నికల్లో కేసీఆర్ ను హటావో బీజేపీ కీ లావో అనే నినాదానికి విజయశాంతి పిలుపునిచ్చారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ అంతా దొంగలేనని.. మా పార్టీ నుంచి ఎవరైనా వెళ్లినా వాళ్లు కేసీఆర్ తొొత్తులేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్నిచేపట్టారు. ఇందులో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం లోని మూసాపేట్ డివిజన్ లో ఇంటింటికి బీజేపీ భరోసా యాత్ర కార్యక్రమానికి విజయశాంతి ముఖ్యఅతిథిగా హాజరై పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ హయాం లో డెవలప్ మెంట్ జరుగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అమెరికాలో సైతం ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించిందని, ప్రపం చమంతా భారత్ వైపు చూస్తోందని.. అందుకు బీజేపీ పాలనే కారణం అన్నారు. అన్ని పార్టీల పాలనను ప్రజలు చూశారు. ఇప్పుడు బీజేపీకి అవకాశం ఇస్తారని ఆకాంక్షించారు. వేరే నేతలతో తాను సైతం బీజేపీని వీడి కాంగ్రెస్ లో చేరుతున్నానని పిచ్చి వార్తలు రాస్తున్నారని కొన్ని మీడియా సంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రగడ్డ నుంచి వచ్చి ఎవరో ఏదో చెబితో అది నిజమనుకుని ప్రచారం చేయడం తప్పు అన్నారు. నిజం తెలిస్తే వార్త రాయాలని, అసత్య కథనాలు ప్రచారం చేయవద్దని సూచించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీని జాకీ పెట్టి లేపుతున్నారు సీఎం కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తన పార్టీ సీట్లు తగ్గుతాయని, కాంగ్రెస్ పార్టీకి హెల్ప్ చేస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ బీఆర్ఎస్ కు సీట్లు తగ్గినా, కాంగ్రెస్ కు సీట్లు వచ్చేలా చేసి ఆ తరువాత ఆ ఎమ్మెల్యేలను తన పార్టీలోకి తీసుకుంటా రని అభిప్రాయ పడ్డారు. కాంగ్రెస్ పార్టీ పెద్ద ప్యాకేజ్ పార్టీ అని, 2018లో అసెంబ్లీ ఎన్నికలల్లో గెలిచిన ఎమ్మెల్యేలను ఎలా అమ్ముకుందో ప్రజలు చూశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ నేతల్ని గెలిపిస్తే వెళ్లి బీఆర్ఎస్ పార్టీలో కలిసి పదవులు తీసుకుంటారని విజయశాంతి ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరిగింది, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ప్రజలకు చేసిందేమీ లేదని రూ.5 లక్షల కోట్లు అప్పు చేశారంటూ మండిపడ్డా రు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొ న్న ఆమె ఇంటింటికీ వెళ్లి.. 9 ఏళ్ల మోదీ పాలనతో దేశానికి కలిగిన ప్రయోజనాలను వివరిస్తున్నారు. బీజేపీ ప్రభుత్వానికి ఎందుకు ఓట్లు వేయాలో ప్రజలకు పథకాలు, ప్రయో జనాలు ద్వారా చెబుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని, సీఎం కేసీఆర్ కు రాష్ట్రం వచ్చిన తొమ్మిదేళ్లకు అమరవీరులు గుర్తుకొచ్చారని సెటైర్లు వేశారు.

# మణిపూర్‌లో చల్లారని రావణకాష్టం

## మంత్రుల ఆస్తులకు ఆందోళనకారుల నిప్ప

ఇంఫాల్,జూన్24 : ఇరు వర్గాల ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మే 3 నుంచి భగ్గుమంటూనే ఉంది. కుకీ వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలతో నెలకొన్న ఉద్రిక్తత కొనసాగుతూనే ఉంది. ఇంఫాల్ తూర్పు జిల్లాల్లోని చింగరేల్‌లో మణిపూర్ మంత్రి ఎల్ సుసింద్రో ప్రైవేట్ గోడౌన్‌కు కొందరు నిప్పంటించారు. శుక్రవారం రాత్రి ఆందోళనకారులు ఈ గోడౌన్‌కు నిప్పంటించడంతో ఇది పూర్తిగా దగ్ధమైందని పోలీసులు తెలిపారు. ఇదే జిల్లాలోని ఖురై ప్రాంతంలో మణిపూర్ ఆహార శాఖ మంత్రి నివాసానికి కొందరు నిప్పంఇంచే ప్రయత్నం చేశారు. సకాలంలో పోలీసులు వీరిని అడ్డగించడంతో వారి ప్రయత్నం విఫలమైంది. మంత్రి నివాసం నుంచి ఆందోళనకారులను చెద్దరగొట్టేందుకు పోలీసులు పలు మార్లు భాష్ప వాయు గోళాలను ప్రయోగించారు. ఈ ఘటనల్లో ఎవరికి ప్రాణ నష్టం వాటిల్లకపోవడంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీ ల్చుకున్నారు. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలతో నిరాశ్రయులైన వారికి ఇండ్లను నిర్మించేందుకు అవసరమైన స్థలాలను మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ పరిశీలించిన కొద్దిసేపటికే మంత్రి గోడౌన్, నివాసంపై దాడులు జరగడం విశేషం. మణిపూర్‌లో అల్లర్లు, అలజడి నెలకొన్నప్పటి నుంచి రాష్ట్ర మంత్రి నెంచ కిపెన్ అధికార నివాసానికి జూన్ 14 కొందరు నిప్పంటించారు. మరుసటి రోజు కేంద్ర మంత్రి ఆర్‌కే రంజన్ సింగ్ నివాసంపై దాడిచేసిన దుండగలు ఆయన ఇంటిని దగ్ధం చేసేందుకు ప్రయత్నించారు. మణిపూర్‌లో మెయిటీ, కుకీ వర్గాల మధ్య చెలరేగిన అల్లర్లలో ఇప్పటివరకూ వంద మందికి పైగా మరణించగా, పెద్దసంఖ్యలో ఇండ్లు దగ్ధమయ్యాయి. తమకు ఎస్టీ హోదా కల్పించాలన్న మెయిటీ వర్గీయులు డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ మే 3న గిరిజన సంఘీభావ మార్చ్ జరిగినప్పటి నుంచి అల్లర్లు చెలరేగాయి.

# గుజరాత్‌లో గ్లోబల్ ఫిన్‌టెక్ ఆపరేషన్ సెంటర్

## గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ వెల్లడి

వాషింగ్టన్,జూన్24 : గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఆపరేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు. వాషింగ్టన్‌లో ప్రధాని మోదీతో చర్చలు తర్వాత ఆయన ఈ విషయాన్ని తెలిపారు. తమ కంపెనీ ద్వారా ఇండియాలో డిజిటైజేషన్ ఫండ్ కింద సుమారు 10 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఇండియాలో ఫిన్‌టెక్ నాయకత్వానికి తాము కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. యూపీఐ, ఆధార్ లాంటి సేవల్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఇండియా విజన్‌ను మరింత విస్తరించేందుకు తాము ప్రయత్నించనున్నట్లు పిచాయ్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పనిచేస్తున్న కంపెనీలకు ఊతం ఇవ్వనున్నట్లు చెప్పారు. భారతీయ భాషల్లోకి బాట్ ను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

# వారాహి యాత్రకు వర్షం అడ్డంకి

## వాతావరణాన్ని బట్టి నేటి యాత్ర

అమలాపురం,జూన్24 : జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ చేస్తున్న వారాహి యాత్ర కు వర్షం అడ్డంకిగా మారింది. డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా... రాజోలు నియోజకవర్గం మలికిపురంలో శనివారం జరగనున్న వారాహి సభ వాయిదా వేసినట్లుగా జనసేన ప్రకటించింది. సభకోసం అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వాయిదా నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం వాతా వరణ పరిస్థితులను పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటారు.రాష్ట్రం బాగుండాలంటే ప్రభుత్వం మారాలి, జనం బాగుండాలంటే జగన్ పోవాలి.. హలో ఏపీ బైబై వైసీపీ అనే నినాదాలతో వారాహియాత్రను పవన్ కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాల్లో ఫీల్డ్ విజిట్ తో పాటు వివిధ వర్గాల వారితో సమావేశం అవుతున్నారు. వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. అన్ని వర్గాలతో మమేకం అవుతూ యాత్ర సాగిస్తూ.. తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇటీవల వారాహి యాత్ర ప్రారంభానికి ముందు పవన్ కల్యాణ్ మంగళగిరిలో ధర్మయాగం నిర్వహించారు. అప్పటి నుంచి ఆయన శాకాహారానికి మాత్రమే పరిమితం అయ్యారు. దీక్ష కారణంగా ఫ్రూట్స్ మాత్రమే తింటూ ఉండటం.. తీరిక లేకుండా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూండటం?.. పవన్ కు కాస్త నీరసం ఏర్పడిందని చెబుతున్నారు. ఈ కారణంగా శుక్రవారం అతి కష్టం మీద బహిరంగభలో రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడారు. వర్షంకారణంగా విశ్రాంతి లభించడంతో పూర్తి స్తాయిలో కోలుకుంటారని జనసేన వర్గాలు భావిస్తున్నాయి.

# గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

శ్రీకాకుళం,జూన్24 : శ్రీకాకుళంలోని శ్రీలక్ష్మీనగర్ కాలనీ వాసులు మరోసారి చైన్ స్నాచింగ్‌ల ఘటనలో భయాందోళనకు గురయ్యారు. బాధితురాలు గౌరి తెల్లవారుజామున తన నివాసం వెలుపల పూలు కోస్తుండగా ఈ ఘటన జరిగింది. అకస్మాత్తుగా, ఒక దుండగుడు వేగంగా ఆమె వద్దకు వచ్చి, ఆమె బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. సహాయం కోసం ఆమె కేకలు వేసినప్పటికీ, ఎటువంటి సహాయం అందలేదు. ఈ ఘటన సమీపంలో ఉన్న సిసిటివి కెమెరాలలో రికార్డు అయింది. చైన్ స్నాచింగ్ కేసులు పెరగడం స్థానిక వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సెప్టెంబర్ 30 నాటికి 2వేల గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

- రాళ్ళు పాతి, భూహక్కు పత్రాలు పంపిణీ పూర్తి చేయాలి
- గ్రామ సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి
- డిశంబరు నెలాఖరుకు వైయస్సార్ హెల్తు క్లినిక్ల నిర్మాణం పూర్తి
- జగనన్నకు చెబుదాం కింద వచ్చే ఆర్థికేతర ఫిర్యాదుల సత్వర పరిష్కారం
- జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశంలో సిఎస్ జవహర్ రెడ్డి



విజయవాడ,జూన్24 : రాష్ట్రంలో రెండవ దశ భూములు రీసర్వే చేపట్టిన 2వేల గ్రామాల్లో సెప్టెంబరు 30 నాటికి రీసర్వేను పూర్తి చేసి సరిహద్దు రాళ్ళు పాతడంతో పాటు భూహక్కు పత్రాలు పంపిణీని పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. జగనన్న భూహక్కు,రీసర్వే, ప్రయారిటీ భవనాలు, జగనన్నకు చెబుదాం అంశాలపై శనివారం విజయవాడ లోని సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు,జాయింట్ కలెక్టర్లతో సియం ముఖ్య సలహాదారు అజయ్ కల్లాంతో కలిసి సిఎస్ వీడియో సమావేశం నిర్వహించారు. అజెండాలో తొలుత భూహక్కు
భూముల రీసర్వే పై కలెక్టర్లతో సమీక్షిస్తూ జిల్లాల వారీ ప్రగతిని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ రెండవ దశ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఒక టైం లైన్ ను పెట్టామని తెలిపారు.అదేమంటే వచ్చే జూలై 31నాటికి విలేజ్ సర్వేయర్ లాగిన్ డేటా ఎంట్రీని ప్రక్రియను పూర్తిచేయాలని చెప్పారు.అలాగే ఆగస్టు 31 నాటికి ÷నైల్ ఆర్ఓఆర్ ను పూర్తిచేసి పబ్లికేషన్ ను కూడా పూర్తి చేయాలని తెలిపారు. అదే విధంగా సెప్టెంబర్ 30 నాటికి రాళ్ళు పాతడంతో పాటు భూహక్కు పత్రాల పంపిణీని కూడా పూర్తి చేయాలని చెప్పారు.అక్టోబరు 15 నుండి రిజిస్ట్రేషన్లను ప్రారంభించాలని సిఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈవిషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ కనపర్చి నిర్దేశిరచిన గడవు ప్రకారం ఈప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిర్దిష్ట గడువు లోగా ఈప్రక్రియను పూర్తి చేసేందుకు కలెక్టర్,జెసి స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు.ఈసమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సిసిఎల్ఏ జి.సాయి ప్రసాద్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాల వారీ భూహక్కు,రెండవ దశ భూరీ సర్వే జరుగుతున్న విధానాన్ని వివరించారు.ప్రతి రోజు దీనిపై కలెక్టర్లతో మానిటర్ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 2లక్షల మ్యుటేషన్లు 4లక్షల సబ్ డివిజన్లు జరిగాయని పేర్కొన్నారు.అంతేగాక ఐదారు లక్షల సరిహద్దు వివాదాలు పరిష్కారం అయ్యాయని చెప్పారు.ముఖ్యమంత్రి వర్యుల ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం మాట్లాడుతూ ఎన్ఆర్ఐలకు సంబంధించిన భూమి పత్రాలను డిజిటల్ రూపంలో పంపాలని సూచించారు.దానిపై స్పెషల్ సిఎస్ సాయి ప్రసాద్ స్పందించి భూ యజమానులైన ఎన్ఆర్ఐలకు పీడీఎఫ్ రూపంలో పంపుతామని చెప్పారు.రాష్ట్ర సర్వే మరియు సెటిల్మెంట్ శాఖ కమిషనర్ సిద్దార్థ జైన్ మాట్లాడుతూ గతంలో సర్వే రాళ్ళను 13వ నోటిఫికేషన్ అయ్యాక పాతేవారని కాని ఇప్పుడు ఆర్ఓఆర్ పూర్తయ్యే వరకు వేచి చూడక ఏక కాలంలోనే పాతాలని చెప్పామని ఆవిధంగానే పనులు జరుగుతున్నాయని తెలిపారు.ఇప్పటికే 700 లకు పైగా గ్రామాల్లో ఆర్ఓఆర్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.ఈసమావేశంలో సియంఓ అదనపు కార్యదర్శి ఆర్.ముత్యాల రాజు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు.అదనపు సిసిఎల్ఏ ఇంతియాజ్ భూహక్కు,రీసర్వే జరుగుతున్న తీరును పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.గ్రామ సచివాలయాల భవనాలు,రైతు భరోసా కేంద్రాల భవనాలను సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేయాలి: సిఎస్.రాష్ట్రంలో చేపట్టిన గ్రామ సచివాలయాల,రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లు ఆదేశించారు.కల్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ ఈ గడువును దృష్టిలో ఉంచుకుని త్వరిత గతిన ఆనిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.వీడియో లింక్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే 6వేల 84 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తి కాగా 1861 ఫినిషింగ్ స్థాయిలోను,825 రెండవ శ్లాబు స్థాయిలోను,523 రూఫ్ స్థాయిలోను,681 రూఫ్ లెయిడ్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు.వీడియో లింక్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి ఇప్పటికే 3వేల 609 భవనాలు పూర్తి కాగా 1100 బేస్మెంట్ స్థాయిలోను,966 రూఫ్ స్థాయిలోను ఉన్నట్టు వివరించారు. వీడియో లింక్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటి. కృష్ణబాబు మాట్లాడుతూ 8321 వైయస్సార్ హెల్తు క్లినిక్ల భవనాల్లో 2246 ఈనెలాఖరు లోగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కాగా 632 బిలో బేస్మెంట్ లెవెల్,1571 బేస్మెంట్ స్థాయిలోను ఉన్నట్టు చెప్పారు. జగనన్నకు చెబుదాం కింద వచ్చే ఫిర్యాదులను త్వరిత గతిన పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లును ఆదేశించారు. కలక్టర్ల తో నిర్వహించిన వీడియో సమావేశంలో ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ ముఖ్యం గా ఆర్థికేతర అవసరాలకు సంబంధించిన అంశాలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈసమావేశంలో సియంఓ పియంయు డిప్యూటీ కలెక్టర్ భవాని శంకర్ మాట్లాడుతూ గత మేనెలలో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటి వరకూ 74వేల 168 ఫిర్యాదులు రాగా వాటిలో 53 వేల వరకూ పరిష్కారం అయ్యాయని చెప్పారు.70 శాతం వరకు ఫిర్యాదులు రెవెన్యూ,పిఆర్ అండ్ ఆర్డి, ఇంధన,ఎంఏయుడి,హోం శాఖలకు సంబంధించినవే ఉన్నాయని పేర్కొన్నారు. అంతే గాక ఫిర్యాదుల్లో అధికశాతం ఆర్థికేతర అవసరాలకు సంబంధించినవే ఉంటున్నా యని తెలిపారు. ఈవీడియో సమావేశంలో వివిధ జిల్లాల కలెక్టర్లు,జెసిలు తదితరులు పాల్గొనగా సిసిఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగ,ఉపాధి రంగాలను బలోపేతం ముఖ్యం

## ధరలపోటుతో సామాన్యుల ఆదాయంపై దెబ్బ

న్యూఢిల్లీ,జూన్24 :ఇప్పటికే రెండుకోట్ల మందికి ఉపాధి గల్లంతయ్యిందన్న వార్తలు వస్తున్నా అది అంతకు మించి ఉంటుందని అంటున్నారు. దేశంలో నిరుద్యోగానికి తోడు, ఉపాధి అవకాశాలు మందగిస్తున్నాయి. మరోవైపు వస్తూత్పత్తి పెరిగినా..ధరల పోటు తప్పడంలేదు. ఉపాధి దొరక్క నేటికీ వేలాదిమంది విదేశాల బాటు పడుతున్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థికసంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని అప్పట్లో పదేపదే రాజన్ గుర్తు చేశారు. దేశంలో ఆటోమొబైల్ రంగ క్షీణత అన్నది నిరుద్యోగాన్ని పెంచే చర్యగా చూడాల్సి ఉంది. కంపెనీలు అమ్మకాలు లేకుండా మూతపడితే నష్టమని గుర్తుంచుకోవాలన్నారు.ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చేసిన హెచ్చరికలు పట్టించు కోలేదు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగి స్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడుకాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్‌ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతున్నాయని రాజన్ గుర్తు చేశారు. ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2-3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలని రాజన్ విశదీకరించారు. గత ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు.2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదని అయితే మన జాగ్రత్తలో మనం ఉండాలన్నారు. కరోనా నేపథ్యంలో అన్ని అంచనాలు తలకిందులు అయ్యాయి. వాటిని గమనంలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన సమయమిదని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. బ్యాంకింగ్ రంగాన్ని పట్టాలకెక్కించేందుకు అన్ని బ్యాంకులు యత్నిస్తున్నాయి. గృహ,వాహన రుణాలపై వడ్డీలు తడిసి మోపెడు కావడంతో మందగమనం కనిపిస్తోంది. అలాగే కస్టమర్లపై ఎడాపెడా వడ్డింపులకు దూరంగా ఉండాలని నిపుణులు చూస్తున్నారు.. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది.ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలని చూస్తోంది. యోనో వంటి యాప్‌ల ద్వారా, దేశీయంగా డెబిట్ కార్డుల వినియోగాన్ని తగ్గించగలమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశం మొత్తంమీద దాదాపు 93 కోట్ల డెబిట్, క్రెడిట్‌కార్డులు వినియోగంలో ఉన్నాయని వెల్లడించారు. యోనో యాప్ సాయంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరించవచ్చని, కార్డు లేకుండా దుకాణాల్లో చెల్లింపులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.

# అంబటి..నోటిపారుదలశాఖ మంత్రి

## ఎద్దేవా చేసిన జనసేన నేత

పల్నాడు,జూన్24 : మంత్రి అంబటి రాంబాబుపై జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటే శ్వరరావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..అంబటి చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పార్టీలో సీనియర్‌గా కనబడటం కోసం అంబటి తలకు రంగు కూడా వేయడం లేదన్నారు. ఫామ్ హౌస్‌లో ఎంజాయ్ చేస్తున్న అంబటి.. జనసేన పార్టీని చూసి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇరిగేషన్ శాఖకు న్యాయం చేయలేని అంబటి.. నీటి పారుదల శాఖ మంత్రి కాదు.. నోటి పారుదల శాఖ మంత్రి అంటూ దుయ్యబట్టారు. వారాహి గురించి ఏదిపడితే అది మాట్లాడం మంత్రి అంబటికి సరికాదని సూచించారు. పవన్‌పై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అవినీతిపై కొన్నిలర్లు ఆరోపణ చేసిన అంబటికి సిగ్గు రాలేదని వ్యాఖ్యానించారు. సత్తెనపల్లి నుంచి జనసేన పోటీలో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# ఆత్మహత్యకు పాల్పడిన మరో మెడికో

## సత్వరమే ఆస్పత్రికి తరలించడంతో తప్పిన ముప్ప

వరంగల్,జూన్24 : జిల్లాలో మరో మెడికో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపుతోంది. కేఎంసీలో పీజీ సెకండ్ ఇయర్ చదువుతున్న లాస్య నిద్రమాత్రలు మింగి బలవన్మరణానికి యత్నించింది. వెంటనే విద్యార్థినిని ఎంజీఎంకు తరలించగా.. వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఇప్పటికే సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులతో మెడికో ప్రీతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆ ఘటన మరువక ముందే మరో విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర సంచలనం రేపుతోంది. ఈ ఘటనపై కేఎంసీ ప్రిన్సిపల్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. మెడికో విద్యార్థినిది ఆత్మహత్యాయత్నం కాదని స్పష్టం చేశారు. విద్యార్థిని లాస్య చాలా కాలంగా మైగ్రేన్‌తో బాధపడుతున్నారని.. దానికి సంబంధించి మెడిసిన్ వాడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈరోజు ఉదయం మైగ్రేన్‌కు సంబంధించిన మెడిసిన్‌ను రెండు సార్లు వేసుకోవడంతో తోటి స్నేహితులు ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు చెప్పుకొచ్చారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి బాగుందని తెలిపారు. సీనియర్ విద్యార్థులు వేధింపులు ఏమీ లేవని మోహన్ దాస్ తెలిపారు. ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మైగ్రేన్ వల్ల మెడిసిన్ వేసుకున్నట్లు మెడికో తెలిపారని, విద్యార్థిని పరిస్థితి బాగుందని తెలిపారు. కేవలం అబ్జర్వేషన్ కోసమే ఆస్పత్రిలో ఉంచినట్లు చెప్పారు.

# పేద విద్యార్థుల చదువు బాధ్యత సిఎం జగన్‌దే

నంద్యాల,జూన్24 : పేద విద్యార్థుల చదువు బాధ్యత అంతా జగన్ మావయ్య చూసుకుంటున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి రెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని కెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నంద్యాల డివిజన్ పరిధిలోని ఉర్దూ మీడియం పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, డిక్షనరీ అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన ఉపాధ్యాయులకు, ప్రోత్సాహం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులను అతిథులు సన్మానించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అందుకోవాలని, నంద్యాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

# పాడి కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

## శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనం

## పీ.ఎస్.లో ఫిర్యాదు



జనగామ జూన్ 24 (ప్రజామంటలు): ముదిరాజ్‌ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి వెంటనే ముదిరాజ్ జాతికి వెంటనే బహిర్గతంగా క్షమాపణలు చెప్పాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై శనివారం జనగామ జిల్లా కేంద్రంలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మకు నెహ్రూ పార్క్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు శవయాత్రను నిర్వహించి అనంతరం దహనం చేశారు. కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆయనను ఎక్కడా తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ముదిరాజ్, ముదిరాజ్ సీనియర్ నాయకులు పిట్టల కుమార్, జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం, పిట్టల సత్యం, దండు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బైక్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ తుపాకుల రాములు పాల్గొన్నారు. అంతకుముందు కౌశిక్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని జనగామ సీఐ శ్రీనివాస్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు.

# ముదిరాజులను అవమానపరిచిన కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలి

## పాలకుర్తిలో నల్ల బ్యాడ్జీలతో ముదిరాజుల నిరసన



పాలకుర్తి జూన్ 24 (ప్రజామంటలు): ముదిరాజులను అవమానపరిచిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం (ముదిరాజ్ సంఘం భవనం) వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.... కులం పేరుతో దూషించడం, అవమాన పరచడం సరికాదని, పరస్పర గౌరవించుకోవడం అవసరమని వారు అన్నారు. కులాల మధ్య అసమానతలు సృష్టించడం సరి కాదని, ముదిరాజులు అన్ని రంగాల్లో ముందుండాలని, సామాజిక రాజకీయ రంగాల్లో తమ చైతన్యాన్ని చాటి చెప్పాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు దాసరి మధు, డైరెక్టర్లు మామిండ్ల రమేష్ రాజా, జీడి మనోహర్, దుంపల సంపత్, సొసైటీ సభ్యులు రేగుల కృష్ణ, జీడి నిరంజన్, ఎలబోయిన సోమేష్, మామిండ్ల సంపత్, శెవ్వ నాగరాజు, జీడి బాలరాజు, శేరు అశోక్, మామిండ్ల భాస్కర్, సాగర్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనిక కుటుంబాలకు సన్మానం



కోరుట్ల టౌన్ జూన్ 24 (ప్రజామంటలు): వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సైనికులుగా సేవలందించిన వారి కుటుంబాలను స్థానిక ఆర్య వైశ్య భవన్ కోరుట్లలో మాజి సైనికుడు శ్రీపతి సురేషకుమార్ సోదరుడు శ్రీపతి రమేష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వనితా క్లబ్ సభ్యులు శ్రీపతి వాణి, బూస మాధురి, మంచాల పద్మ, ఇంటర్ నేషనల్ వాసవి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత లో రాజీ లేదు




హుస్నాబాద్ 24 మార్చి (ప్రజామంటలు): తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్ఆర్ఆర్ కార్యక్ర మం లో భాగంగా శని వారం హుస్నాబాద్ మున్సిపల్ రెండో వార్డ్ లో కౌన్సిలర్ బోజు రమా దేవి రవీందర్ ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్త మున్సి పల్ ఆటోకి ఇవ్వాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వార్డ్ ఆఫీసర్ జై శంకర్, ఇన్వాల్వెంట్ఇంజనీర్రవి,ఆర్పిశ్రీలత,రెండోవార్డు ప్రజలు పాల్గొన్నారు.

# జులై 6 నుంచి సమ్మె బాటలో పంచాయతీ ఉద్యోగ, కార్మికులు

## కలెక్టర్ కు వినతిపత్రం అందజేత



జగిత్యాల జూన్ 24 (ప్రజామంటలు): తమ 17 డిమాండ్ల సాధనలో భాగంగా గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు జులై 6 నుంచి నిరవధిక సమ్మె బాట పట్టనున్నారని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక జేఏసీ నాయకులు కలెక్టర్ కు ఇచ్చిన వినతిపత్రం లో కోరారు. శనివారం సిఐటియు, ఏఐటియుసి, టిజికెబీయు, ఐఎఫ్టియు నాయకులతో కలిసి కలెక్టర్ ఆఫీసులో సమ్మె పై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.... పంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని మరో 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ కు అందజేశామన్నారు. పరిష్కారనికి ఈనెల 21 వ తేదీ ప్రభుత్వానికి చివరి తేదీ అయినా ప్రభుత్వం స్పందించడం లేదని విధిలేని పరిస్థితిలో ఎప్పుడైనా నిరవధిక సమ్మెలోకి పోతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘ జిల్లా నాయకులు ఎండి ఉస్మాన్, ముదుగం రాజలింగు, ఏఐటీయూసీ సెక్రెటరీ అధ్యక్షులు ఎండి ముక్రం, సుతారి రాములు, కే. శ్రీనివాస్, రాంబాబు, సిఐటియు నాయకులు పులి మల్లేష్, చంద్రశేఖర్, జంగిలి ఎల్లయ్య, మామిడిపల్లి గంగన్న, పోచయ్య, రాజయ్య మరియు గ్రామపంచాయతీ సిబ్బంది, జోగవ్వ, రాధ, నర్సుబాయ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జగన్నాథ రథయాత్రకు జగిత్యాలలో స్వాగతం పలికిన భక్తజనం





జగిత్యాల జూన్ 24 (ప్రజామంటలు): జగిత్యాల పట్టణముకు జగన్నాథ రథయాత్ర చేరుకుంది. ఈ రథయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. రథం ముందు నేలను ఉడుస్తూ శుభ్రపరుస్తూ కల్లాపి చల్లి ముగ్గులు వేస్తూ భక్తులు విశేష సంఖ్యలో రథయాత్రకు స్వాగతం పలికారు. రథం ముందు భక్తులు భజనలు చేస్తూ మంగళహారతులు ఇస్తూ రథయాత్రను కొనసాగించారు. ప్రత్యేక వాహనాన్ని సాంప్రదాయ బద్ధంగా అలంకరించి రథంపై జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర దేవి విగ్రహాల నుంచి రథయాత్రను కొనసా గించారు. రథయాత్ర కొనసాగుతున్న ప్రాంతమంతా జాతరను తలపిం పజేసింది. స్వామివారి నామస్మరణ చేస్తూ రథయాత్ర గమ్యస్థానం చేరుకొంది.

# ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్లు




## యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల/ సిరిసిల్ల జూన్ 24 (ప్రజామంటలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరియు జగిత్యాల్ జిల్లాలలో మహిళా కాంగ్రెస్ జిల్లా రివ్యూ మీటింగ్ కు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ముఖ్యఅతిథిగా విచ్చేసినారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మరియు జగిత్యాల్ జిల్లా లో మహిళా కాంగ్రెస్ రివ్యూ మీటింగ్ లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రివ్యూ మీటింగ్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు కాముణి వనిత అధ్యక్షతన జరిగిన రివ్యూ మీటింగ్లో మరియు జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన రివ్యూ మీటింగ్ లో 2 జిల్లాలలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు మాట్లాడుతూ.... జిల్లా కమిటీ సభ్యులతో .మండల కమిటీ మెంబర్లతో. బ్లాక్ ప్రెసిడెంట్లతో. పట్టణ కమిటీ మెంబర్లతో మాట్లాడడం జరిగింది.ప్రతి ఒక్కరూ కమిటీలు మొత్తం పూర్తి చేయాలని ఎన్నికల సమయం కాబట్టి ప్రతి ఒక్కరూ గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ నీ బలోపేతం చేయడానికి కంకణ బద్ధులై ప్రతి ఒక్కరు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సునీత రావు అన్నారు. మహిళా డిక్లరేషన్ ప్రియాంక గాంధీ వచ్చి ప్రకటిస్తారని కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తుందని సునీత రావు అన్నారు.

# పుట్టినరోజు మొక్కలు నాటిన బింగి నర్సింహులు, పండగ సాయి



జనగామ జూన్ 24 (ప్రజామంటలు): జనగామ అమ్మ ఫౌండేషన్ టీమ్ సభ్యుడు బింగి నర్సింహులు, పండగ సాయి పుట్టినరోజు సందర్భంగా జనగామ బర్త్డే ట్రీ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో స్థానిక సంజయనగర్ ప్రాంతంలో శాలువాతో సత్కరించి ఒక మొక్క నాటి పుట్టినరోజు జరుపుకున్నారు. జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణీ కుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్ రాజ్, టీమ్ సభ్యులు సల్ల మహేష్, మద్దెల కార్తిక్, పండగ నరేష్, లవ్లీ నర్సింగ్, సన్నీ డాన్సర్, నల్ల వంశీ, ఆకునూరి అభిలాష్ పాల్గొన్నారు.

# జగన్నాథ రథయాత్రలో జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దంపతులు



జగిత్యాల జూన్ 24 (ప్రజామంటలు): పట్టణంలో జగన్నాథ రథయాత్రలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రలో పాల్గొన్న జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. జగన్నాథ రథాన్ని అక్కడున్న భక్తులతో కలిసి లాగుతూ ముందుకు కొనసాగారు . జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్క భక్తునిపై స్వామివారి కృప కటాక్షాలు ఉండాలని కోరుతూ సుఖ సంతోషాలతో కలకాలం ఉండాలని ఆ భగవంతుని వేడుకున్నానని తెలిపారు. వారి వెంట మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ అవారి శివకేసరి బాబు, జగన్నాథ రథయాత్ర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జగిత్యాల బ్రాహ్మణ వీధిలోని హరిహరాలయంలో హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం మహిళలచే పవిత్ర ఆషాడమాస ఉత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం గోరింటాకు ఉత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా మహిళలంతా తమ చేతులకు వివిధ రకాల డిజైన్లతో గోరింటాకు అలంకరించుకున్నారు. అంతేకాకుండా మహిళలందరూ ఒకే రకమైన రంగు చీరలు ధరించి గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. అంతకముందు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం అల్పాహారం సేవించారు.

# అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు

## దశాబ్ది ఉత్సవాల్లో కళ్లకు కట్టిన అభివృద్ధి: జీవన్ రెడ్డి

నిజామాబాద్,జూన్24 : సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయంగా ప్రభుత్వ ఫలాలు అందేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో సీఎం ముందుకు సాగుతున్నారన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ 9 ఏళ్ల అభివృద్ధిని కళ్లకు కట్టినట్లుగా చెప్పామని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలుస్తోందని అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందులో భాగంగానే వ్యక్తిగతంగా కాకుండా ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. అందుకే ప్రజలు సీఎం కేసీఆర్ పాలనకు బ్రహ్మరథం పట్టి స్వచ్ఛందంగా భారత రాష్ట్ర సమితిలో చేరుతున్నారని, అది చూసి జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు అర్థరహిత విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. పని చేసే నాయకులకే ప్రజలు పట్టం కడుతారని, ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. తొమ్మిళ్ల తెలంగాణ ప్రభుత్వ హయాంలో కరంటు కోసం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయంటూ, తాగునీరు, సాగునీరు, లోవోల్టేజీ, ఎరువులు దొరకడం లేదంటూ ఎక్కడా రోడ్డెక్కలేదన్నారు. ఉనికి కోసం ప్రతిపక్ష నాయకులు చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కెసిఆర్ హ్యాట్రిక్ కొడతారని అన్నారు.

# చేసిన పనులనే దశాబ్ది ఉత్సవాల్లో చెప్పాం

## ఇంకెంతకాలం కెసిఆర్ ఆరచాకాలు భూములను అప్పనంగా కాజేస్తున్నారు మండిపడ్డ కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ

కామారెడ్డి,జూన్24(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ అరాచాకాలను, అక్రమాలను ఇంకెంతకాలం సహిద్దామని మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దపు దగా సందర్భంగా కాంగ్రెస్ నిరసలను చేపడితే ఎందుకు అరెస్టులు చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వం అంతా మంచే చేస్తే ఎందుకు అడ్డుకోవాలన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, గిరిజనులకు పోడు భూములపై హక్కు కల్పించలేదని విమర్శించారు. వేల కోట్ల ప్రైవేట్ దోపిడి, వందల కోట్ల పార్టీ ఆస్తులు ఉన్నా.. కేసీఆర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 33 జిల్లాల్లో వందల కోట్ల విలువ చేసే ప్రజల భూమిని దోచి పెట్టారని రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఈ బరితెంగింపును ఇట్లానే వదిలేద్దామా అని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయాలకు కోట్లు విలువ చేసే భూమిని తక్కువ ధరకు కేటాయించారని విమర్శించారు. ఇకపోతే దళితబంధు పేరుతో దగా చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్క దారి పట్టాయని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి దళిత, గిరిజనుల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు. గత ప్రభుత్వాలు దళిత గిరిజనుల అభివృద్ధి పథకాలపై స్వయంగా ముఖ్యమంత్రులే 3, 6 నెలలకు ఒకసారి సమీక్షలు నిర్వహించే వారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలాకాలం తరవాత దళితుల సంక్షేమం గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు.

# తట్టుకోలేకనే కాంగ్రెస్, బిజెపిల విమర్శలు

## కెసిఆర్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి: వంటేరు

సిద్దిపేట,జూన్24 : ఉమ్మడి ఎపిలో తెలంగాణలో అన్నివర్గాలకు అన్యాయమే జరిగిందని, ఎరువులు, విత్తనాలు, కరెంటు కోసం రోడ్లెక్కిన విషయం తెలిసిందేనని అటవీ అభివృద్ధిశాఖ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి ఎన్నో కొత్త పథకాలను తెచ్చిన కేసీఆర్ ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని ఉన్నారన్నారు. ఇంటింటికి మంచినీరు, నిరంతర కరెంట్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కెసిఆర్ ఘనత అన్నారు. ఇవే విషయాలను దశాబ్ది ఉత్సవాల్లో ఊరూరా ప్రజలకు వివరించామని అన్నారు. చేసిన పనులను, కళ్లకు కనిపిస్తున్నవే ప్రజలకు తెలియచేశామని అన్నారు. గత ప్రభుత్వాల మాదిరి మసిపూసి మారేడుగాయ చేయలేదన్నారు. ఉనికికోసమే కాంగ్రెస్,బిజెపి నేతలు సిఎం కెసిఆర్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు కావాలనే విమర్శలు చేస్తున్నారని అన్నారు. కెసిఆర్ ప్రశ్నలకుముందు బిజెపి నేతలు సమాధానం ఇవ్వాలన్నారు. స్వార్థరాజకీయాల కోసమే బిజెపి విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఉనికిని చాటుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఉద్యమ సమయంలో ఆంధ్ర ప్రాంత నాయకులకు వంత పాడుతూ తెలంగాణకు ద్రోహం చేసిన విషయం ప్రజలు ఇంకా మరచి పోలేదని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని వంటేరు విమర్శించారు. కెసిఆర్ జాతీయ రాజకీయాలతో బిజెపిని దునుమాడడం ఖాయమన్నారు. బిజెపి డ్రామాలు ఇక బయటపడతాయని అన్నారు.

# బాలుడిపై దాడి...బోనులో చిక్కిన చిరుత

## చిరుత బందీ కావడంతో భక్తులకు ఊరట

తిరుమల,జూన్24 : తిరుమల అలిపిరి నడక మార్గంలో ఏడో మైలు వద్ద మూడేండ్ల బాలుడిపై దాడిచేసిన చిరుతపులి బోనులో చిక్కింది. దాడి అనంతరం చిరుతను పట్టుకోవడానికి అధికారులు నడక దారిలో రెండు బోన్లు, 150 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం రాత్రి 10.45 గంటల సమయంలో చిరుతపులి బోనులో చిక్కిందని అధికారులు తెలిపారు. దానికి ఏడాదిన్నర వయసు ఉంటుందని చెప్పారు. అయితే ఒక్కరోజులోనే చిరుతను బంధించడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.గురువారం రాత్రి తిరుమల నడక మార్గంలోని 7వ మైలు వద్ద ఓ చిరుతపులి బాలుడిపై దాడిచేసింది. తన తాతతో కలిసి అక్కడే ఉన్న దుకాణంలో తినుబండారాలు కొనుక్కుంటుండగా ఒక్కసారిగా వచ్చిన చిరుత.. బాలుడి మెడ పట్టుకుని ఎత్తుకెళ్లింది. వెంటనే స్పందించిన దుకాణదారుడు, బాలుడి తల్లిదండ్రులు, భద్రతా సిబ్బంది కేకలు పెడుతూ చిరుత వెనుక పరుగులు తీశారు. దీంతో కంట్రోల్ రూం వద్ద బాలుడిని వదిలేసి అడవిలోకి వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలుడిని పద్మావతి చిన్నపిల్లల దవాఖానకు తరలించారు.

# ట్రాక్ మరమ్మతులు, నిర్వహణ పనులు

## పలు రైళ్లను రద్దుచేసిన దక్షిణమధ్యరైల్వే

ట్రాక్ మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 36 రైళ్లను రద్దుచేసింది. ఈ నెల 25 ఆదివారం నుంచి జూలై 3 వరకు ఈ రైళ్లను రద్దు చేసినట్లు తెలిపింది. వీటిలో కొన్నిటిని ఒక్కోరోజు, మరికొన్ని అన్ని రోజులు రద్దుచేసినట్లు అధికారులు వెల్లడించారు. మేడ్చల్-సికింద్రాబాద్ మధ్య నడిచే రైళ్లను జూన్ 25, 26 తేదీల్లో, కాచిగూడ నుంచి రాయచూర్, మహబూబ్‌నగర్ వెళ్లే రైళ్లను జూన్ 26 సోమవారంనాడు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఇక కరీంనగర్ నుంచి నిజామాబాద్, సిర్పూరు టౌన్ మధ్య నడిచే రైళ్లను జూన్ 26 నుంచి జూలై 3 వరకు, కాజీపేట నుంచి డోర్నకల్, భద్రాచలం-విజయవాడ, సికింద్రాబాద్ నుంచి వికారాబాద్, వరంగల్ ప్యాసెంజర్ రైళ్లను ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వీటితోపాటు హైదరాబాద్- లింగంపల్లి-చందానగర్-ఫలక్‌నుమా-రామచంద్రాపురం మధ్య తిరిగే ఎంఎంటీఎస్ రైళ్లను కూడా రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. కాజీపేట-డోర్నకల్ డోర్నకల్-కాజీపేట, డోర్నకల్-విజయవాడ-డోర్నకల్, భద్రాచలం- విజయవాడ- భద్రాచలం, సికింద్రాబాద్-వికారాబాద్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-వరంగల్, వరంగల్-హైదరాబాద్, సిర్పూర్ టౌన్-కరీంనగర్-సిర్పూర్ టౌన్, కరీంనగర్-నిజామాబాద్-కరీంనగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, బల్లార్షా-కాజీపేట-బల్లార్ష, భద్రాచలం-బల్లార్ష, సిర్పూర్ టౌన్-భద్రాచలం, కాచిగూడ-మహబూబ్‌నగర్-కాచిగూడ, కాచిగూడ-రాయచూరు, రాయచూర్- గద్వాల-రాయచూర్, రాయచూర్-కాచిగూడ, సికింద్రాబాద్-మేడ్చల్-సికింద్రాబాద్ రైళ్లు ఉన్నాయి.



# డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ విద్యార్థి

హైదరాబాద్,జూన్24 : రంగారెడ్డి జిల్లా నార్సింగిలో డ్రగ్స్ కలకలం రేపుతున్నాయి. సన్‌సిటీ వద్ద డ్రగ్స్ తీసుకుంటున్న ఓ విద్యార్థిని పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద లభించిన 5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 14 ఇన్సులిన్ సిరెంజ్‌లు, ఓ వెయింగ్ మిషన్‌తో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. డ్రగ్స్‌తో పట్టుబడిన విద్యార్థిని సాకేత్‌గా గుర్తించారు. అతని స్వస్థలం కృష్ణా జిల్లా గన్నవరం అని పోలీసులు తెలిపారు. అతడు బెంగుళూరులో డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు తెలుస్తున్నది. డ్రగ్స్‌ను రాజేంద్రనగర్ ప్రాంతంలో అమ్మడానికి వచ్చి పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అతనిపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రగ్స్ ఎవరికి విక్రయించడానికి వచ్చాడు. బెంగుళూరులో అతనికి డ్రగ్స్ ఎవరు ఇచ్చారు అనే కోణంలో విచారిస్తున్నారు.

# నదీజలాల వినియోగంపై చర్చించాలి

వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృధాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయటపడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధా నించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించు కోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. దేశ జనాభా పెరుగుతున్న క్రమంలో మన వ్యవసాయాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఆలోచనలు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపని గా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారు తున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చ లేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు.

# అత్యవసర స్థితిలో పౌర హక్కుల కాలరాతపత్రికా స్వేచ్ఛకు సంకెళ్ళు

## జూన్ 25, 1975... ఎమర్జెన్సీ విధించిన దినం సందర్భంగా...



ఆంగ్లేయుల పరిపాలన నుండి విముక్తి పొంది స్వాతంత్ర్యం సంపాదించుకుని ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నాక, 28ఏళ్లకే సదరు స్వాతంత్ర్యాన్ని దేశ ప్రజలు కోల్పోవాల్సి వచ్చింది. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నిక పై ప్రత్యర్థి రాజ్ నారాయణ్ చేసిన న్యాయ పోరాటంలో ఇందిర కోర్టు తీర్పు ద్వారా ఎన్నిక చెల్ల నేరదని తీర్పు వచ్చాక, ఏకపక్షంగా రాష్ట్రపతి ద్వారా దేశంలో ఎమర్జెన్సీ ప్రకటిత మయింది. ఎమర్జెన్సీ సమయంలో నియంత ఇందిరాగాంధీ తన ప్రత్యర్థులను జైలుపాలు చేయడంతో పాటు ప్రజాస్వామ్య హక్కులను హరించి వేశారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు హరించి వేయబడ్డాయి. ప్రచార, ప్రసార మాధ్యమాలపై ఆంక్షలు అమలయ్యాయి. పత్రికలపై ముందస్తు సెన్సార్ షిప్ ప్రవేశపెట్టారు. ఏ వార్త అయినా సంబంధిత ప్రభుత్వ అధికారి ఆమోదిస్తే తప్ప ప్రచురణకు నోచుకోని పరిస్థితి నెలకొంది. ఎన్నో ఎన్నో పత్రికలకు నిషేధించారు.. వాటిలో కొన్ని జాగృతి (తెలుగు, హైదరాబాద్), సృజన (తెలుగు, హైదరాబాద్), ప్రజాసమస్యలు (తెలుగు, రాజమండ్రి), మెయిన్ స్ట్రీమ్ (ఇంగ్లీష్, ఢిల్లీ), జవానీ దివాని (హిందీ, ఢిల్లీ), ఆర్గనైజర్ (ఇంగ్లీష్, ఢిల్లీ), సెమినార్ (ఇంగ్లీష్, ఢిల్లీ), సాధన (గుజరాతీ, అహ్మదాబాద్), భూమిపుత్ర (హిందీ, బరోడా), లోకవాణి (కన్నడ, బెంగళూరు), పాంచజన్య (హిందీ, లక్నో), ఒపీనియన్ (ఇంగ్లీష్, ముంబై) రాష్ట్ర వార్త (మలయాళం, ఎర్నాకులం), విక్రమ్ (కన్నడ, బెంగళూరు), క్వెస్ట్ (ఇంగ్లీష్, ముంబై) వంటి ఎన్నో పత్రికలు నిషేధానికి గురయ్యాయి. శంకర్ వీక్లీ లాంటి ఏకైక కార్టూన్ పత్రిక సెన్సార్ నిబంధనలతో ఏకీభవించ లేక మూసుకోవలసి వచ్చింది. పత్రికలపై సెన్సార్ షిప్ ఉండడంతో అన్ని భాషలలోనూ అజ్ఞాత పత్రికలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా చిన్న చిన్న పుస్తకాలు ముద్రించి పంపిణీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వందేమాతరం, ఎక్స్ రే, గర్జన, అంతర్వాణి, ప్రజావాణి, జనవాణి పేర్లతో అజ్ఞాత పత్రికలు ప్రచురించారు. తొలిరోజుల్లో వివిధ పేర్లతో అజ్ఞాత పత్రికలు వెలువడి నప్పటికి చివరివరకు వందేమాతరం, ఎక్స్ రే.లాంటి కొన్ని పత్రికలు కొనసాగాయి. ఆర్ ఎస్ ఎస్ తో సహా అనేక సంస్థలను నిషేధించారు. క్రమశిక్షణ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులపై ఆంక్షలు, నిఘా మొదలైంది. ఇందిరాగాంధీ, ఆమె పాలనకు వ్యతిరేకంగా ఏ చిన్న వ్యాఖ్య చేసినా అరెస్ట్ చేసి జైలులో పెట్టే పరిస్థితి ఏర్పడింది. ఇందిర కుమారుడు సంజయ్ గాంధీ పెత్తనం నడిచింది. నిర్బంధ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగాయి. రహదారుల విస్తరణ పేరుతో ముందస్తు నోటీసులు లేకుండా ఇళ్లను కూల్చివేశారు. ఇలా అంతటా నిర్బంధ విధానాలు కొనసాగాయి.

అయితే ఈ పరిణామాలతో సాధారణ ప్రజలు భయభ్రాంతులకు గురైనప్పటికీ, ప్రతిపక్ష రాజకీయ నాయకులు, ఆర్ ఎస్ ఎస్ వంటి సంస్థలు ఇందిర నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా అజ్ఞాత ఉద్యమాన్ని నిర్వహించాయి. ప్రభుత్వ అవకతవక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చాయి. అనేక వేల మందిని నిర్బంధించినప్పటికీ దేశవ్యాప్తంగా అజ్ఞాత ఉద్యమం కొనసాగింది.

ఎమర్జెన్సీ ప్రకటించి నెలరోజులు పూర్తైనప్పుడు 1975 జులై 26న ఆర్ ఎస్ ఎస్ దేశవ్యాప్తంగా వ్యక్తిగత సత్యాగ్రహాలు, గంటానాదాల కార్యక్రమాలు చేపట్టింది. దేశ వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో గంటలు మ్రోగించడం ద్వారా ప్రజలు తమ నిరసన తెలియ జేశారు. 1975 జులై 26 నుంచి పదిరోజుల పాటు వ్యక్తిగత సత్యాగ్రహాలు జరిగాయి. అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలలో ప్రముఖులు ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ సత్యాగ్రహం చేసి అరెస్ట్ అయ్యారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమపు రెండవ అంకంలో 1975 నవంబర్ 14 నుంచి 1976 జనవరి 26 వరకు సత్యాగ్రహాలు జరిగాయి. ప్రతివారం పది, 15మందితో అన్ని జిల్లాలు, చిన్నచిన్న పట్టణాలలో సత్యాగ్రహాలు చేశారు. అనేకచోట్ల మహిళా సత్యాగ్రహాలు కూడా చేపట్టారు. కరపత్రాలు పంచుతూ ప్రజలను చైతన్య పరుస్తూ అరెస్ట్ అయ్యారు. అంతకుముందు 1975 ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అజ్ఞాత కార్యకర్తలు కరపత్రాలను పంచారు. ప్రజాస్వామ్యాన్ని ఇందిరా గాంధీ అపహాస్య పాలు చేస్తున్న వైఖరిని ఆ కరపత్రాల్లో తీవ్రంగా ఎండగట్టారు. ఈ ఉద్యమంలో ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నప్పటికి మొత్తం పోరాటం లోక సంఘర్ష సమితి (ఎల్ ఎస్ ఎస్) పేరుమీద లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగింది.

అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 23 జిల్లాలకు చెందిన సుమారు 250 మందిని -మీసా' చట్టం కింద అరెస్ట్ చేశారు. సుమారు రెండున్నర నెలలపాటు జరిగిన సత్యాగ్రహాల్లో 354 స్థలాల్లో 5వేలమంది సత్యాగ్రహం చేశారు. వీరిలో 1,655మందిని అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో డి ఐ ఆర్ చట్టం కింద 703మందిని అరెస్ట్ చేయగా వీరిలో 672మంది ఆర్ ఎస్ ఎస్ పరివార సంస్థలకు చెందినవారే. దేశవ్యాప్తంగా మొత్తం 23 వేల మంది మీసా, డి ఐ ఆర్ కింద అరెస్ట్ చేశారు. ఒక లక్షా 54 వేలమంది సత్యాగ్రహం చేశారు. 21 నెలలపాటు మహా ఉధృతంగా సాగిన అజ్ఞాత ఉద్యమ ఫలితంగా 1977 మార్చి మూడవ వారంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీమతి ఇందిరా గాంధీతోసహా కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం సంభవించింది. పాత కాంగ్రెస్, భారతీయ జనసంఘ్, లోక్ దళ్, సోషలిస్ట్ పార్టీల విలీనంతో ఏర్పడిన జనతాపార్టీ లోక్ సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. అంతిమంగా ప్రజాస్వామ్యం విజయం సాధించింది.



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విష యాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.coకు పంపవచ్చు.. -ఎడిటర్

# కులాసా కాకమ్మ



ఒక పల్లెను ఆనుకుని చిన్నపాటి అడవి ఉంది. ప్రమాదకరమైన ప్రాణులేమీ లేనందున జనాలు ఆ అడవిగుండా సమీపంలోని పట్నానికి రాకపోకలు సాగించే వారు. ఒక రోజు ఒక నెమలి అడవి దాటి పల్లెలో కి ప్రవేశించింది. ఒక డాబా ఇంటిముందు పంజరంలో రామ చిలుక దానిని పలకరించింది. పెరటిలోని మామిడి చెట్టు పై గూడు కట్టుకుని ఉన్న కాకి కొత్త నేస్తాన్ని సాదరంగా కొమ్మలపైకి ఆహ్వానించింది. ఆ గుబురు కొమ్మల్లో దాగి సుఖంగా కూర్చున్న నెమలి పరిసరాలను గమనింప సాగింది. స్వేచ్ఛ లేకుండా బందీగా ఉన్న చిలుకను చూసి నెమలి హృదయం జాలితో నిండింది.ఇంతలో ఆ ఇంటి యజమాని తియ్యని జామ పండు ముక్కలు, జీడిపప్పు పలుకులు పళ్ళెంలో పెట్టి తెచ్చి చిలుక ముందుంచాడు. 'రామ్ రామ్" అన్నాడుఆకుపచ్చని ఈకలు, ఎర్రని ముక్కుతో అందంగా ఉన్న ఆ రామచిలుక కూడా " రామ్ రామ్" అంది ముద్దుగా. నెమలి ఆశ్చర్యపో యింది.ప్రేమగా చిలుకతో కబుర్లాడుతున్న ఆ మనిషి తననూ ఇష్టపడాలని ,తనకూ ఆ జీడిపప్పు తినిపించాలని దానికి ఆశ కలిగింది. గొంతెత్తి తానూ అరిచింది. కర్ణకఠోరంగా ఉన్న ఆ కూత విన్న మనిషి చిరాగ్గా మొహం చిట్లించాడు. నెమలి చిన్నబోయింది.'ఓహో! చిలుక పలుకే బంగారం. అందుకే దానికి అంత ప్రేమ దక్కుతోంది' అనుకుంది. చిలుకపై దాని జాలి అసూయగా మారింది. విచారంతో కొమ్మల్లో ఒదిగి కూర్చుని ఉంది.కాకి గొంతు కూడా బాగాలేదు. అందుకే దానిని పెంచుకోరు కాబోలు అనుకుంటూ తొట్టి దగ్గర వాలి ఎంగిలి మెతుకులు తింటున్న కాకిని జాలిగా చూసింది. దానికి చిలుకకున్న అందమూ లేదు,గొంతూ లేదు. మంచి తిండీ లేదు. కానీ కాకి సంతోషంగా ఉంది అని వింతగా చూసింది.తాను అందమైన పింఛాలను, ఒంటి రంగును కలిగి ఉంది. కానీ గొంతు కీచుగా ఉండడం వలన మనిషి తనను చూడకుండానే అసహ్యించుకున్నాడు. తన గొంతూ కోయిలలా చిలుకలా తీయగా ఉంటే ఎంత బాగుండేది? కానీ అది జరగని పని.ఈ ఆలోచనతో నెమలికి దుఃఖం ముంచుకొచ్చింది.తన నోట కూడా బంగారంవంటి పలుకులు పలికించమని దేవుడిని వేడుకోసాగింది. ఇంతలో ఆకాశంలో నల్లని మబ్బులు కమ్మాయి.చల్లని గాలి వీచింది. నెమలి ఆ ఆహ్లాదకరమైన వాతావరణంలో మైమరచిపోయింది.నేలపైకి వాలి పురివిప్పి ఆనందంగా నాట్యం చేయసాగింది. ఆ ఇంటి యజమానే కాక చుట్టుపక్కల ఇళ్ళలోని పిల్లలూ పెద్దలూ కేరింతలు కొడుతూ చేరి సంభ్రమంతో నెమలి నాట్యం చూడసాగారు.కాకి చిలుకలా పలకనూ లేదు. తనలా నృత్యం చేయనూ లేదు. కానీ అది అపరిమితమైన సంతోషంతో నెమలిని అభినందించింది.నెమలి దిగులు తీరింది.సృష్టిలోని ప్రతి ప్రాణికీ దేని ప్రత్యేకత దానికి ఉంటుంది.ఒకరితో పోల్చుకుని నైరాశ్యానికి లోనవకుండా మన ధర్మం మనం నెరవేరుస్తూ మనకి ఉన్న చిన్ని జీవితాన్ని సంతోషంగా గడపాలి. కులాసాగా , స్వేచ్ఛగా ఎగురుతున్న కాకి కలిగించిన కనువిప్పు అదే. తేటబడిన మనసుతో నెమలి చిలుక,కాకిలకు వీడ్కోలు పలికి ఆనందంగా తిరిగి అడవి దిశగా ఎగిరిపోయింది.

**గుడిపూడి రాధికారాణి,**
**మచిలీపట్నం.9494942583**

## ధ్యానం..యోగాతో నిత్యనూతనత్వం

తిరుమల,జూన్24 :మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు.రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయ కుండా చచ్చుపడతాయి. మన శరీరం లోకి వెళ్లిన ఆహారం 24 గంట ల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బు లకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు. మన శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం. అందుకే ఋషులు అంటారు... 'మనం రోజూ జీవిస్తున్నాం అని అను కుంటున్న మూర్ఖులం... నిజానికి మనం రోజూ కొద్దీ కొద్దీగా మరణిస్తు న్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?... మనం ప్రతి రోజూ... నెగెటివ్ ఎనర్జీ లతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నా మన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొంది నెగెటివ్ ఎనర్జీ దూరం చెయ్యాలి.

# కనుమరుగైన కవి వీరుడు - జంగ వీరయ్య



ఎంతో భవిష్యత్తు ఉందని ఆశ పడిన కవి జంగ వీరయ్యను 2023 జూన్ 3 న అకాల మృత్యువు కబళించింది. వీరయ్య మిత్రులకు పిడుగుపాటు వార్త అది. వీరయ్యది జనగామ జిల్లాలోని తరిగొప్పుల గ్రామం. తల్లితండ్రులు సుభద్ర ముత్తయ్య. 1980 మే 20 నాడు జన్మించిండు. తను మొదటి సంతానం. పదవ తరగతి వరకు గ్రామంలో విద్యాభ్యాసం. తెలుగు పండితుడు ఆర్ వి కమలాకర్ పలికే పద్యాలు ఆసక్తిని పెంపొందించినయి. వేలేరుకు చెందిన మిత్రుడు సురేశ్ మరణం చలింప చేసింది. "వెళ్లిపోయావా నేస్తం" అని తొలి కవిత వ్రాసిండు. తన ఊరి నుండి తెలుగు పండితుడైన అశోక్ పరిచయం సాహితీ సృజన వైపు అడుగులు వేయించింది. బతుకుతెరువు కోసం వి3 డిజిటల్ ఫోటో స్టూడియో నడిపే వాడు. స్టూడియో పేరు కలుపుకొని "వీత్రిజ" అని కలం పేరు పెట్టుకొన్నడు. వరిష్ఠ కవులు నందిని సిధా రెడ్డి, లింగంపల్లి రామచంద్ర, పల్లేరు వీరస్వామి, పొట్లపల్లి శ్రీనివాస రావు, బిల్ల మహేందర్ ల సలహాలు సూచనలు తీసికొనే వాడు. అశోక్ తో కోఠిలో పుస్తకాలు కొంటున్నప్పుడు తన పుస్తకాలు కూడా అట్లా ఉండాలని కోరిక కలిగింది. 119 సమస్యలపై 119 చుక్క పద్యాలు ప్రాసతో వ్రాసిండు. వాటితో తొలి సంపుటి "ప్రాస కెరటాలు" వేసిండు. వీరయ్య కవిత్వం రెండవ సంపుటి "అక్షర సమరం", మూడవ సంపుటి "అక్షర సంచారం". వ్యంగ్యం, అధిక్షేపం వీరయ్య కవిత్వంలో తొణికిసలాడుతయి. పని తప్ప ప్రచారం ఆశించని వీరయ్యను నవతెలంగాణ పత్రికలో "అంకురం" శీర్షికన పరిచయం చేసిండు అలువాల నరేందర్. అది వరంగల్ జిల్లా సంచికలో 2016 ఆగస్ట్ 17 నాడు అచ్చులో వచ్చింది.వీరయ్య ఉత్సాహవంతుడు. కార్యదక్షత కలవాడు. జనగామ రచయితల సంఘం వ్యవస్థాపనలో ముందున్నడు. తెలంగాణ రచయితల సంఘం పటిష్టతకు కృషి చేసిండు. తెలంగాణ యాదవ యువసేన, తెలంగాణ యాదవ యువ రచయితల సమూహం ఏర్పాటు చేసిండు. జనగామ జిల్లా సాధన, తరిగొప్పుల మండల సాధనలో వీరయ్య పాత్ర మరువలేనిది. జనగామ, తరిగొప్పుల మీద చక్కని పాటలు వ్రాసిండు. తరిగొప్పుల గ్రామ చరిత్ర పరిశోధన చేసిండు. లింగంపల్లి రామచంద్ర, రెడ్డి రత్నాకర్ రెడ్డి ల మార్గదర్శనంలో దానికి ప్రకటించాలని భావించిండు. ఊరు అభివృద్ధికి, గ్రంథాలయం నిర్వహణకు కృషి చేసిండు. పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికై పాఠశాల జీర్ణోద్ధరణకు పూనుకొన్నడు. సాహిత్యం, సామాజిక బాధ్యత అభేద్యమని ఆచరించిండు. వీరయ్య పరిచయాలను ప్రాణ ప్రదంగా కాపాడుకొనే వాడు. అలసట లేని ప్రయాణాలు చేసే వాడు. భోళా మనిషి. బిడ్డకు పదవ తరగతి మండల ప్రథమ స్థానం దక్కిందని చాలా సంతోష పడ్డడు. సొంత ఇంటి కల నెరవేరనున్న సందర్భంగ మిత్రులతో కవితలు వ్రాయించి సంపుటి సిద్ధం చేసిండు. అది వెలుగు చూడక ముందే తను చీకటిలో కలిసి పోయిండు. తను లేని ఇంటిలో తామెట్లా ఉండగలమని భార్య, బిడ్డ శోకిస్తున్నరు. కొన్నాళ్లుగా అనారోగ్యం జ్వరం రూపంలో ఇబ్బంది పెట్టినా ఒంటరి పోరాటం చేసిండు. కవులు కందాళ శోభ, ఆ తరువాత సంద బాబుల మరణం ఆయనను తీవ్రంగా కలవర పెట్టింది. మనోక్లేశం హృదయాఘాతమైంది. మిత్రులు వీరయ్యను తరిగొప్పుల అలిశెట్టి గ పిలుచుకొనే వారు. అలిశెట్టి ప్రభాకర్ వలెనే జంగ వీరయ్య కూడా ఎటుకాని వయసులో దూరమై పోయిండు. కవి మిత్రులు వీరయ్య కుటుంబ ఆర్థిక ఆలంబన కోసం స్వచ్ఛందంగా పూనుకోవటం వేదనలోనూ ఒకింత స్వాంతన.

**-డాక్టర్ రాపోలు సత్యనారాయణ**
**9440163211**




# బీఆర్ఎస్ నిరంకుశ పాలనకు చరమ గీతం పాడాలి



కోరుట్ల రూరల్ జూన్ 24 (ప్రజామంటలు): మహాజన్ సంపర్క్ అభియాన్ లో భాగంగా ఇంటింటి బీజేపీ నినాదంతో కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు సురభి నవీన్ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలు, ప్రజలతో ముచ్చటిస్తూ కేంద్రంలో మోదీ హయాం లోని బీజేపీ ప్రభుత్వం అవినీతి రహిత పాలనతో ముందుకు సాగుతున్నారని మరియు కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో గ్రామీణ సడక్ యోజన క్రింద రహదారులు నిర్మించారని, స్వచ్ఛ భారత్, మోదీ ఆవాస్ యోజన ఇలాంటి సంక్షేమ పతకాలతో దేశాన్ని అగ్ర స్థానంలో నిలిపారని వివరించారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన రావాలంటే బిజెపి ని గెలిపించి బిఆర్ఎస్ నిరంకుశ పాలనకి చరమగీతం పాడాలని ప్రజలకు తెలిపారు.కార్యకర్తలకు బీజేపీ ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అంబళ్ళ సుదర్శన్, ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోరుపాక రమేష్, కోరుట్ల మండల అధ్యక్షులు పంచరి విజయ్, ఎస్సి మోర్చ మండల అధ్యక్షులు వేల్పుల నర్సయ్య, బూత్ అధ్యక్షులు అన్నేల సురేష్, జేం సురేష్, కటుకం నాగరాజు, బిజేవైఎం మండల అధ్యక్షులు వెంకటరెడ్డి రాజు, కోరుట్ల పట్టణ కార్యదర్శి ఎర్ర రాజేందర్, చిక్యాల దామోదర్, బిజేవైఎం మెట్ పల్లి పట్టణ కార్యదర్శి తిరుమల్, కటుకం గణేష్, ఎనుగందుల మనోజ్, మట్టెల నరేందర్, గట్ల ప్రతాప్, బోల్లపెల్లి రాహుల్, బోనగిరి రవి, నగునూరి నరేష్, సిహెచ్ రవి, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొంగురాల రాజేష్ పటేల్ కు మున్నూరు కాపు సంఘ సన్మానం



ధర్మపురి జూన్ 24 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు యువత ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన బొంగురాల రాజేష్ పటేల్ ను ధర్మపురి పట్టణ మున్నూరు కాపు సంఘము ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్నూరు కాపు సంఘం నాయకులు సంగి రాజశేఖర్, వ్యవస్థాపక అధ్యక్షులు బండి మురళి, గౌరవ అధ్యక్షులు సంగి నర్సయ్య సార్, చల్ల గంగన్న, కాశెట్టి రాంబాబు, ఆకుల శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, బండారి సత్య నారాయణ, సోమిశెట్టి శేఖర్, బొంగురాల సత్తన్న, కౌన్సిలర్లు బండారి అశోక్, అయ్యోరి వేణు గోపాల్, కో ఆప్షన్ సభ్యులు అప్పాల వసంత్, కుల పెద్దలు పాల్గొన్నారు.

# మైనార్టీలకు అండగా బీఆర్ఎస్ మంత్రి కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్ జూన్ 24 (ప్రజామంటలు): మైనారిటీలకు బీఆర్ఎస్ పాలనలోనే మంచి అవకాశాలు లభించాయని రాష్ట్ర సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.ధర్మపురి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎండి షబ్బీర్ ఆధ్వర్యంలో రాష్ట్ర సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో శనివారం నాడు పలువురు మైనార్టీ సోదరులు బిఆర్ఎస్ లో చేరారు. హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి కొప్పుల ఈశ్వర్ వీరికి గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు వివిధ వర్గాలకు చెందిన వారు ఎందరో ఆకర్షితులు అవుతున్నారని చెప్పారు. బిఆర్ఎస్ లో చేరిన వారిలో ఎండి. వజీర్, యూసుఫ్, జబ్బార్, ఆరిఫ్, ఫయాజ్, ముజహిద్, మోబిన్, జావీద్, అశ్రర్ సహా 50 మంది ఉన్నారు.

# కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులుగా చెన్న విశ్వనాథం, పేట భాస్కర్



కోరుట్ల జూన్ 24 (ప్రజామంటలు): కోరుట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్లాలనే సంకల్పంతో ఏర్పడ్డ కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ నూతన కమిటీని శనివారం సి ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో జరిగిన ఫోరమ్ సమావేశంలో సభ్యులందరి ఆమోదంతో ఎన్నుకున్నారు. కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్షులుగా చెన్న విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా పేట భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఎగ్యారపు మురళి, మిర్జా ముఖ్రమ్ బేగ్, కోశాధికారిగా రాసకొండ పెద్ద దేవన్న, సహాయ కార్యదర్శిగా పాతర్ల విజయ్, ప్రచార కార్యదర్శిగా మహ్మద్ రఫీ, కమిటీ సభ్యులుగా షాహిద్ మహ్మద్ షేక్, రాడం అశోక్, ఎండి అబ్దుల్ అజీజ్, సయ్యద్ ఏక్బాల్ తో పాటు అన్ని కుల సంఘాల నుండి కమిటీ సభ్యులుగా ఉంటారని పట్టణానికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులతో చర్చించి సమావేశంలో చేసిన తీర్మానాలను ప్రధాన కార్య దర్శి పేట భాస్కర్ ప్రకటించారు. అనంతరం ఫోరమ్ ను రిజిస్ట్రేషన్ చేయించాలని, ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చుకునేందుకు నూతన కమిటీ నాయకులు కృషి చేయాలని సభ్యులు కోరారు. ఈ సమా వేశంలో ఫోరమ్ సభ్యులు ఇలియాస్ ఖాన్, సుతారి రాములు, మానుక ప్రవీణ్, మాసం నరేందర్, అందే రామయ్య, ఎన్నం రాధ, సాంబార్ మహేష్, తాళ్లపెల్లి రాజగంగారాం, రాజగణేష్, అలీ పాల్గొన్నారు.

# దైవ స్వరూపంగా పూజించబడిన కవి శిల్పం

## చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి

జనగామ జూన్ 24 (ప్రజామంటలు): వెయ్యి ఏళ్ల కిందటే కవులు సైతం విగ్రహ రూపంలో సామాన్య ప్రజలచే పూజలు అందుకు న్నారంటే నమ్మ శక్యం కాదు. జనగామ కు చెందిన చరిత్ర పరిశోధ కుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి తన పరిశోధనలో ఒక కవిని దైవ స్వరూ పంగా భావించి పూజించినట్లు తెలిపే శిల్పాన్ని వెలుగులోకి తెస్తున్నారు. ఈ విషయాలను శనివారం జనగామలో వివరించారు. జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండలం, ఇబ్రహీం పూర్ గ్రామ శివారులో లక్ష్మీ తండా వెళ్లే తోవకు కుడివైపున శిరస్సు ఖండించగ మొండెంతో ఉన్న శిల్పం ఉంది. ఆసీనుడై ఉన్న ఈ శిల్పం శైవ మతానికి చెందినది కవిది. కుడి చేతిలో ఘంటం, ఎడమ చేతిలో తాలపత్రం ఉంది. మెడలో విలువైన రాళ్లు పొదిగిన హారం, లింగం కాయ ధరించిన మరో హారం, జంధ్యం ఉన్నాయి. ఈ ప్రాంతంలో 1160-1240 ల మధ్య కాలంలో జీవించిన పాలకుర్కి సోమనాథుడు శైవ మతాన్ని ప్రచారం చేసాడు. అతడి మరణానంతరం విగ్రహరూపం లో పూజించ బడుతున్నట్లుగా పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి భావిస్తున్నారు.



మరో కవి శిల్పం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఘనపూర్ మండల కేంద్రమైన ఘణపూర్ లోని గణపేశ్వరాలయం గర్భ గుడి ద్వారానికి కుడివైపున అర్ధవృత్తాకార మెట్టుకు కనిపిస్తుంది. శా.శ. 1199-1260 మధ్యకాలంలో కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన గణపతి దేవుడు శా.శ. 1213లో ఈ కోట గుళ్ళను నిర్మించాడు. కోటగుళ్ళు లోని కవి శిల్పానికి సైతం లింగం కాయ ధరించడం కనిపి స్తుంది. ఈ శిల్పాలను బట్టి 12,13 శతాబ్దాలలో కవులకు ఎన లేని ప్రాధాన్యం లభించినట్లు తెలుస్తోంది. పురావస్తు శాఖ ఇబ్రహీం పూర్ లోని కవి శిల్పాన్ని భద్రపరచాలని రత్నాకర్ రెడ్డి కోరారు.

# ఇంటింటా బిజెపి నాయకుల ప్రచారం



నర్మెట్ట జూన్ 24 (ప్రజామంటలు): బిజెపి మండల అధ్యక్షుడు ధరావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వెల్దండ గ్రామం తోపాటు పలు గ్రామాలలో మూడవ రోజు మహాజాన్ సంపర్క్ యోజన లో భాగంగా 9సంవత్సరాల నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను ఇంటింటా తిరిగి ప్రజలకు వివరించి పాంప్లెన్స్,డోర్ స్టిక్కర్స్ , అతికించి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మద్దతుగా 9090 902024 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇప్పియడం జరిగింది. అనంతరం 9 సంవత్సరాల నరేంద్ర మోడీ పాలన సందర్భంగా వెల్దండ గ్రామంలో ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత రెడ్డి హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ.... తెలంగాణలో అన్ని గ్రామ పంచాయతీలకు నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం సీసీ రోడ్లకు, స్మశానవాటిక లకు, రైతు వేదికలకు, డంపింగ్ ఆడ్ లకు, హరితహారం లకు, స్ట్రీట్ లైట్లకు, కెసిఆర్ ఇస్తున్న కెసిఆర్ కిట్లలో 6000 రూపాయలు, మరుగుదొడ్ల నిర్మాణ లకు 12 వేల రూపాయలైతే 9000 రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తా ఉంది. 90% నిధులతో అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. కానీ అంతా టిఆర్ఎస్ ప్రభుత్వమే ఇస్తుందని ప్రజలకు మభ్య పెట్టడం చెప్పడం సిగ్గుచేటని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో ఇప్పటివరకు నాలుగు కోట్ల గృహాలను ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో రెండున్నర లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నిధులు వచ్చిన విషయం తెలంగాణ ప్రజలు గమనించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శాతెలి రాజు సోషల్ మీడియా మండల కన్వీనర్ మోహన్ భాష బీజేవైఎం జనగామ టౌన్ ప్రెసిడెంట్ క్రాంతి గ్రామ శాఖ అధ్యక్షులు రాజు కిరణ్ మహేష్ రాజు మరియు బూత్ కమిటీ సభ్యులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:ఎస్పీ భాస్కర్

జగిత్యాల జూన్ 24 (ప్రజామంటల): సైబర్ మోసాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు చెక్ పెట్టవచ్చు అని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా పరిధిలో గడిచిన వారం రోజులో 23 పిర్యాదులు రావడం జరిగిందని ఈ యొక్క పిర్యాదులో బాధితులు 9,96,827/- రూపాయలు కోల్పోవడం జరిగినదని ఈ యొక్క పిర్యాదులో వెంటనే స్పందించి టోల్ ఫ్రీ నెంబర్లు 1930, డయల్ 100 లకు కాల్ చేసిన పిర్యాదులో 81,088/- రూపాయలు ఫ్రిజ్ చేయడం జరిగిందని కావున జిల్లా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ నేరాలు జరుగు విదానం పట్ల అవగాహన ఉంటే చాలావరకు నేరాలను తగ్గించవచ్చు అని జిల్లా ఎస్పి తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఆశ, భయం అనే రెండు అంశాల మీద సైబర్ నేరాలు చేస్తున్నారు. ఒక వ్యక్తికి ఏదైనా ఆశ చూపించి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు వస్తాయని అతని నుండి వ్యక్తిగత సమాచారం తీసుకుని సైబర్ నేరం చేయడం జరుగుతుంది మరియు భయం ఏదైనా వ్యక్తికి సంబంధించిన బ్యాంకు అకౌంట్ కానీ, పాన్ కార్డు కానీ, ఇతర అకౌంట్లు బ్లాక్ అవుతుందని భయపెట్టి వారి నుంచి వ్యక్తిగత సమాచారం తీసుకొని సైబర్ నేరం చేస్తున్నారు కావున ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930, డయల్ 100 కి కాల్ చేస్తే మీరు పోగొట్టుకున్న డబ్బులను చాలా వరకు తిరిగి పొందేలా చేయవచ్చు అని తెలిపారు.

### జిల్లా పరిధిలో గతవారం రోజులలో సైబర్ కేసులు

తీసుకోవలసిన జాగ్రత్తలు: మీకు లాటరి, లోన్ వచ్చిందని, కాల్ గాని మెసేజ్ గాని వచ్చిందా ?.. ఆశపడకండి, అనుమానించండి. వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చెయ్యండి. అపరిచిత వ్యక్తుల నుండి



వచ్చే వీడియో కాల్స్ లిఫ్ట్ చెయ్యకండి, చేస్తే వాళ్ళు నగ్నంగా ఉండి, మీకు చేసిన వీడియో కాల్ రికార్డు చేసి, మిమ్మల్ని బెదిరించి డబ్బులు లాగేస్తారు. వేలల్లో పెట్టుబడి లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాట్సాప్, టెలిగ్రామ్ ప్రకటనలను నమ్మకండి. తక్కువ డబ్బులు పెట్టినప్పుడు లాభాలు ఇచ్చి ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టినప్పుడు డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తారు. ఇలాంటి సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చెయ్యండి. మీకు ఉద్యోగం ఇస్తాం అంటూ మెసేజెస్ చేసి, మిమ్మల్ని డబ్బులు కట్టమంటున్నారు అంటే వాళ్ళు సైబర్ మోసగాళ్ళు అని గ్రహించండి. "ఇన్స్టాగ్రామ్" లో మీకు తెలిసిన వ్యక్తి ఫోటో వుండి మిమ్మల్ని డబ్బులు పంపమని అడుగుతు న్నాడా? మరి ఆ మెసేజి మీకు తెలిసిన వ్యక్తే పంపాడా? తెలుసు కోండి, మోసపోకండి. సోషల్ మీడియా లో ప్రకటనలు చూసి పెట్టు బడి పెట్టకండి, కొంచెం ఆగి ఆలోచించండి, అది సైబర్ మోసం కూ డాకావచ్చు. మీ ప్రమేయం లేకుండా మీకు ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పకండి. అది సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ అయి వుండవచ్చు అన్నారు.

# అధికార మదమా...? అగ్రవర్ణ అహంకారమా..?

## బోయిగూడలో ముదిరాజ్ ల ఆగ్రహం

సికింద్రాబాద్ జూన్ 24 (ప్రజామంటలు): ముదిరాజ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం బోయిగూడలోని రాష్ట్ర ముదిరాజ్ భవన్ లో ముదిరాజ్ మహాసభ నాయకులు ఆందోళన నిర్వహించారు. ముదిరాజ్ భవన్ నుంచి గాంధీనగర్ పీఎస్ వరకు ర్యాలీ గా వెళ్ళిన నాయకులు కౌశిక్ రెడ్డిపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముదిరాజ్ లను అవమానించిన కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఇన్స్పెక్టర్ మోహన్ రావుకు కంప్లైంట్ రాసి ఇచ్చారు. అనంతరం కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ దహనం చేశారు. సీఎం కేసీఆర్ వెంటనే కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్సీ పదవినుంచి తొలగించాలని, లేనిపక్షంలో రాష్ట్రంలో ఉన్న 50 లక్షల మంది ముదిరాజ్ ల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి దాడిలో గాయపడిన ముదిరాజ్ బిడ్డ



బండి అజయ్ కి మెరుగైన వైద్య సేవలు అందించి, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ నాయకులు శ్రీనివాస్, టి. సురేందర్, శ్రీకాంత్, పొట్లకాయల వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, శారద, మాలతి, సత్యం, రాజు, వినోద్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో ఇంటింటికి బిజేపి కార్యక్రమం



ఎల్కతుర్తి జూన్ 24 (ప్రజామంటలు): మండల కేంద్రంలో మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ రాష్ట్ర హౌస్ ఫెడ్ చైర్మన్ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి హాజరై నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ 9 సంవత్సరాల్లో వారు సాధించిన ప్రగతిని, మరియు అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించుకుంటు ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్ల కాపరుల విభాగం జిల్లా అధ్యక్షులు ముష్క వెంకటేష్ ఆడెపు శ్రీవర్ధన్, ఉపాధ్యక్షులు పల్లెపాటి మధుకర్, చిదురాల వెంకటేష్, దామెర గ్రామ ఎంపిటిసి గొర్రె ఆదం సీనియర్ నాయకులు నాగెల్లి రంగారెడ్డి, శ్రీపతి, మధుకర్ గౌడ్, పెరుగు మధుసూదన్ కోడం రమేష్, ఎర్రోళ్ల రాజు, బూత్ అధ్యక్షులు నాంపల్లి అశోక్, యర సదానందం, భువనగిరి నాగరాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు స్వాతి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గొడిశాల వినయ్, బీజేవై ఎం మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి అంచనగిరి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రాజు, అధికార ప్రతినిధి కొమ్మిడి శ్రావణ్, కార్యదర్శి బోనగిరి వెంకటేష్ పాల్గొన్నారు.

# కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభోత్సవం

బచ్చన్నపేట జూన్ 24 (ప్రజామంటలు): క్రీడలు మానసిక ఉల్లాసనికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని పీసీసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. బచ్చన్నపేట మండల కేంద్రంలో కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులతో క్రికెట్ ఆడి సందడి చేశారు.అనంతరం మాట్లాడుతూక్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జిల్లెల్ల సిద్దా రెడ్డి, ఎంపీటీసీ నల్లగొని పుష్ప బాలకిషన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్,ఆలేటి సిద్దిరాములు, దిడిగ రమేష్,బుచ్చి రాజ్, అమృత రెడ్డి, సిద్దులు, మోటే శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, జాయ మల్లేషం, కొమ్మూరి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి క్రాంతి,కొమ్మూరి యువసేన జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగోని వేణు, కంఠం కరుణాకర్, అఖిల్ మాల, బక్క ప్రవర్ధన్, గాజుల రాజు యాదవ్, పోచంపల్లి నాగరాజు,



మహేష్, ప్రశాంత్, క్రాంతి, సోహెల్, సంజయ్, రఘు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు తగ్గించాలి : ఎస్.ఎఫ్.ఐ



జనగామ జూన్ 24 (ప్రజామంటలు): జి.ఒ. 1 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు తగ్గించాలని, పుస్తకాలు యూనిఫాం టై బెల్ట్ అమ్మకూడదని, జిఒ 91 సెక్షన్ 8(1) ప్రకారం ఐఐటీ ఒలంపియాడ్ టెక్నో అనే పేర్లతో ఫీజులు వసూలు చేయాకూడదని ఎస్ ఎఫ్ ఐ జనగామ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. శనివారం జనగామలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జి.ఒ. 42 ప్రకారం ( డిస్టిక్ ఫీజు రెగ్యులేషన్ కమిటీ ) ప్రకారం ఫీజులు తీసుకోవాలని అన్నారు. కానీ డిఇఒ ప్రైవేట్ పాఠశాల యాజమన్యం కుమ్మక్కై విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రవేటు యాజమాన్యం పై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం అని హెచ్చిరించారు. ఈనెల 26న జరిగే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కలక్టర్ ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, నాయకులు తరుణ్, వికాస్, విజయ్, మహేందర్, అజయ్ పాల్గొన్నారు.

# బింగి నరసింహులు పుట్టినరోజు తాను, తన స్నేహితుల రక్తదానం



జనగామ జూన్ 24 (ప్రజామంటలు): జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి బింగి నరసింహులు పుట్టినరోజు సందర్భంగా తాను తన స్నేహితులు రక్తదానం చేసి స్నేహితులు రక్తదానం చేశారు. ఈ సంద ర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు వంగ భీమ్ రాజు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ మాట్లాడుతూ.... అన్నదాన కార్యక్రమాలతో పాటు రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నమన్నారు. బింగి నరసింహులు, నల్ల వంశీ, మత్స్య సాయి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి సల్ల మహేష్, మద్దెల కార్తీక్, లవ్లీ నర్సింగ్, సన్నీ డాన్సర్, సల్ల వంశీ, ఆకునూరి అభిలాష్ పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి : సిపిఐపార్టీ



ఎల్కతుర్తి జూన్ 23 (ప్రజామంటలు): ఇంటి స్థలాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి ఆన్లైన్ దరఖాస్తులను పరిశీలించిన తాసిల్దార్ సూరారం గ్రామపంచాయతీ పరిధిలోని గుడిబండ పల్లెలో వేసిన గుడిసెలను వెంటనే పట్టాలు ఇచ్చి నిరుపేద ప్రజలను ఆదుకోవాలని గుడిసె వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మండల పార్టీ కార్యవర్గ సభ్యులు నిమ్మల మనోహరుడు, అంబాల స్వామి, సూర మొగిలి, మర్రిపెల్లి తిరుమల పోచయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన డీఈవో అబ్దుల్ హై



భీమదేవరపల్లి జూన్ 24 (ప్రజామంటలు): మండలంలోని కస్తూరిబా విద్యాలయాన్ని జిల్లా విద్యాధికారి అబ్దుల్ హై శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అన్ని రికార్డులు సరైన విధంగా నిర్వహించాలని ఆదేశించారు. తరగతి గదులలో విద్యార్థులతో పాఠశాల జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో సమాజాన్ని ఏ విధంగా తీర్చి దిద్దాలో విద్యార్థులకు పలు విలువైన సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, విద్యాలయ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2 వరకూ 36 రైళ్ల రద్దు

సికింద్రాబాద్ జూన్ 24 (ప్రజామంటలు): దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2 వరకూ ఏకంగా 36 రైళ్లను రద్దు చేసింది. అలాగే పలు ఎంఎంటీఎస్ రైళ్లను సైతం రద్దు చేసింది. హైదరాబాద్ - సికింద్రాబాద్ మార్గంలో ట్రాక్ మరమ్మతు పనుల కోసం ఈ రైళ్ల రద్దును దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 26 నుంచి రద్దు కానున్న ఎంఎంటీఎస్ రైళ్లు ఏవనగా

లింగంపల్లి -హైదరాబాద్-హైదరాబాద్ - లింగంపల్లి
చందానగర్ - లింగంపల్లి -లింగంపల్లి - చందానగర్
లింగంపల్లి - ఫలక్‌నుమ ఫలక్‌నుమ - లింగంపల్లి
రామచంద్రపురం - ఫలక్‌నుమ రద్దు కానున్న 36 రైళ్లు..
కాజీపేట-డోర్నకల్ -డోర్నకల్-కాజీపేట
డోర్నకల్-విజయవాడ-విజయవాడ -డోర్నకల్
భద్రాచలం-విజయవాడ-విజయవాడ - భద్రాచలం
సికింద్రాబాద్- వికారాబాద్-వికారాబాద్ - సికింద్రాబాద్
సికింద్రాబాద్ - వరంగల్-వరంగల్ - హైదరాబాద్
సిర్పూర్ టౌన-కరీంనగర్-కరీంనగర్ - సిర్పూర్ టౌన్
కరీంనగర్ -నిజామాబాద్-నిజామాబాద్-కరీంనగర్
కాజీపేట-సిర్పూర్ టౌన్-సిర్పూర్ టౌన్ - భద్రాచలం
బల్లార్ష -కాజీపేట-కాజీపేట - బల్హర్షా
భద్రాచలం- బల్లార్ష -బల్హర్షా-కాజీపేట
కాచిగూడ-మహబూబ్‌నగర్-మహబూబ్‌నగర్- కాచిగూడ
కాచిగూడ -రాయచూరు-రాయచూరు - కాచిగూడ
రాయచూరు-గద్వాల్ -గద్వాల్ - రాయచూర్
సికింద్రాబాద్ - మేడ్చల్ - మేడ్చల్ - సికింద్రాబాద్

## నేడు పొలాస లలితమాత ఆలయంలో చండి హవనం

### సుహాసినులచే లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం

జగిత్యాల జూన్ 24 (ప్రజా మంటలు): జగిత్యాల రూరల్ మండలం పొలాస లలితమాత ఆలయంలో నేడు చండిహవన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని 108 శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయ ట్రస్టీ ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. దేవాలయ వైదిక సలహాదారు, జ్యోతిష, వాస్తు శాస్త్ర పండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక మంగళాశాసనాలతో 108 శ్రీ చక్ర సహిత శ్రీ లలితా మాత ప్రతిష్ఠ కార్యక్రమం జరుపుకొని 108 రోజులకు చేరిన సందర్భంగా ఆదివారం చండీ హవన కార్యక్రమం జరుగుతుందని ఆమే వివరించారు. నేడు ఉదయం 8:00 గంటల నుండి గణపతి పూజ, పుణ్యాహావాచనము, రక్షాబంధనం, సర్వతో భద్రమండల రచన, మహాకలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, చండీ హవనం, బలిహరణం, కుమారి పూజ, సువాసిని పూజ, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన మహదాశీర్వచనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలుంటాయని ఆమె తెలిపారు. అలాగే ఉదయం 9.30 గంటలకు మాతలచే సామూహిక శ్రీ లలితా సహస్రనామ నామ స్తోత్ర పారాయణం నిర్వహించబడుతుందని అన్నారు. వైదిక కార్యక్రమంలు బ్రహ్మశ్రీ తిగుళ్ల విశుశర్మ నిర్వహణలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్టీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మ వారి కృపకు పాత్రులు కాగలరని స్వరూప కోరారు. కార్యక్రమానంతరం తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని స్వరూప తెలిపారు.

## రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బందు

### ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ



కోరుట్ల టౌన్ జూన్ 24 (ప్రజామంటలు): జూన్ 26 సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు అన్ని బంద్ పాటించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్య మంత్రి కేజీ టూ పీజీ ఉచిత నిర్బంద విద్యను అమలు చేస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ప్రభుత్వ పాఠశాలలను రేషనలైజేషన్ పేర 8624 పాఠశాలలను మూసివేశారని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయలు కలిపించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్య బట్టారు. 6800 ప్రాథమిక పాఠశాలల్లో ఓకే ఉపాధ్యాయుడు ఉన్నాడని 596 మండలాలోని 578 మండలాలకు విద్యాధికారులు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రములో 15 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాడవేణి సునీల్ సోమవారం విద్యా సంస్థలు అన్నీ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు.

## ముదిరాజుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి

### బేషరతుగా క్షమాపణ చెప్పాలి



ఇబ్రహీంపట్నం జూన్ 24 (ప్రజామంటలు): పాడి కౌశిక్ రెడ్డి ముదిరాజ్ జాతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఇబ్రహీంపట్నం ముదిరాజ్ సంఘ నాయకులు యూత్ ఆధ్వర్యంలో పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కాలోజీ టివి జర్నలిస్ట్ అజయ్ ముదిరాజ్ పై పాడి కౌశిక్ రెడ్డి కిడ్నప్ చేసి హత్యకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తూ అజయ్ కుటుంబానికి అండగా జవత్ ముదిరాజ్ జాతి అండగా ఉందని తెలియజేస్తూ అసహ్య వ్యాఖ్యలు చేసి ముదిరాజ్ లను కించపరచడం సరికాదని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మొదటి అమరుడు అయిన ముదిరాజ్ జాతికి చెందిన పోలీస్ కృష్ణయ్య ముదిరాజు అమరత్వంతో పాటు ఎంతోమంది ముదిరాజ్ లు తమ ఆత్మ బలిదానాలు చేసుకున్నారు. అలాంటి జాతిని కించపరిచే విధంగా మాట్లాడడం సమంజసం కాదని వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్టల శ్రీనివాస్, పిట్టల వంశీ, గడ్డం మహేష్, బావులు, సబ్బని రవి, అక్షయ్, నరేష్, నేమురి నరేందర్, పిట్టల భూమెష్, అశోక్, బాలక్రిష్ణ, సాయ్, ఆనంద్, సల్కం నరేష్, సల్వాల ధన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టండి



హుజూరాబాద్ జూన్ 24 (ప్రజామంటలు): హుజూరాబాద్ నియోజకవర్గంలో శాసనమండలి సభ్యులు ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి, హుజూరాబాద్ శాసనసభ్యులు ఈటెల రాజేందర్ ఒకరిపై ఒకరు పరస్పర, వ్యక్తిగత ఆరోపణలు చేసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించకుండా, వ్యక్తిగత స్వార్థంతో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి ఆరోపించారు. శనివారం రోజున స్థానిక సిఐటియు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.... నియోజవర్గ ప్రజల కనీస మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన ప్రజాప్రతినిధులే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం నియో జక వర్గ ప్రజల దౌర్భాగ్యం అన్నారు. రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధుల మధ్య వ్యక్తిగత దూషణలు, పరస్పరం బురద జల్లుకోవడం, అందుకు తామేమి తక్కువ కాదన్నట్టు ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి ప్రజా ప్రతినిధులు, నాయకులు ఒకరిపై ఒకరు ప్రెస్ మీట్ లు పెట్టి బురద జల్లుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని హితవు పలికారు. దేశంలో, రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వ్యక్తి గత విమర్శలు చేసుకుంటూ ప్రజల ఆలోచనలు పక్కదారి పట్టించే విధంగా టిఆర్ఎస్, బిజెపి నాయకులు ప్రయత్నిస్తుండడం విచారకరమన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇప్పటికీ కాలయాపన చేస్తున్న డబల్ బెడ్ రూమ్ ఇల్లు, నిరుద్యోగ భృతి, ఏకకాలంలో రుణమాఫీ ఆచరణలో ఇప్పటికీ నెరవేర్చలేదు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెప్పించి ప్రతి ఒక్కరి అకౌంట్లో 15 లక్షల రూపాయలు జమ చేస్తామని జన్ ధన్ ఖాతాలను ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా అర్ధ రూపాయి కూడా జమ చేయలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఎటు పోయిందని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలు కూడా తీసేస్తూ కార్పోరేట్లయినా అదాని, అంబాని లకు ఊడిగం చేస్తున్నారన్నారు. రైతును భూమి నుండి వేరు చేసే మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి రైతులు పెద్ద ఎత్తున వ్యతిరేకించి చట్టాలను వెనక్కి తీసుకునే విధంగా అలుపెరుగని పోరాటం సాగించారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ కాలం వెళ్ళదీస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటికీ ఇంటి నిర్మాణానికి 3 లక్షల రూపాయలు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. పది లక్షల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలందరికీ వెంటనే పంపిణీ చేయాలని అసంపూర్తిగా ఉన్న ఇండ్లను వెంటనే పూర్తి చేసి పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ఐక్య ప్రజా పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని అందుకు రాబోయే కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళన పోరాట కార్యక్రమాలకు ప్రజానీకం కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జోన్ కమిటీ కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, జోన్ కమిటీ సభ్యులు వద్ల రాజు, కదిరే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హరితహారం సామాజిక బాధ్యత

- గ్రీన్ కవర్ పెంచేలా కృషి చేయాలి
- నిరంతరంగా మొక్కల పెంపకం సాగాలి

నిర్మల్,జూన్24 :హరితహారం ప్రతి ఒక్కరి కార్యక్రమమని, దీనిని సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు రాబట్టవచ్చని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. గత తొమ్మిదేళ్లుగా సిఎం కెసిఆర్ పట్టువదలని విక్రమార్కుడిలా చేపట్టిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోందని అన్నారు. దీంతో గ్రీన్ కవర్ 7.7 శాతం పెరిగిందని అన్నారు. ఇది నిరంతరంగా సాగితే త్వరలోనే తెలంగాణ ఆకుపచ్చని తెలంగాణ కాగలదని అన్నారు. దీనిని మరింత చైతన్యవంతంగా తీసుకుని వెళితే కోతులు వాపస్ పోవడం..వానలు వాపస్ రావడం ఖాయమన్నారు. ఇకపోతే హరితహారం నిరంతర ప్రక్రియ అని ప్రజలంతా గుర్తుంచుకోవాలని చెప్పారు. ప్రతి ప్రభుత్వ సంస్థల్లో వంద శాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రభుత్వంతో కలసి రావాలని అన్నారు. ప్రతి జిల్లాను హరిత జిల్లాగా మార్చాలనీ, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని అన్నారు. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాల న్నారు. మూడు ఫీట్లకు పైగా ఉన్న మొక్కలను మాత్రమే నాటాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కార్యాచరణ రూపొందించాలనీ, హరితవనాల కోసం స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. ఏ రకం మొక్కలు ఏయే ప్రదేశాల్లో నాటాలో అటవీ శాఖ అధికారులు సూచనలివ్వాలని, సరైన సమయంలోనే మొక్కలు నాటడం చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు పండ్ల మొక్కలను సంబంధిత గ్రామప్రజలతో మాట్లాడి వారి సహాయ సహకారాలతో నాటాల న్నారు. నర్సరీల్లో మొక్కలు సరైన దశలో వృద్ధి చెందిన మీదటే నాటేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణాల్లో జంక్షన్లు, రోడ్ల సుందరీకరణకు మొక్కలు నాటాలన్నారు. అవసరాలకు ఏయే రకం మొక్కలు ఎన్ని కావాలో సర్వే చేసి తదనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టామని తెలిపారు. వీటిని ప్రజలు కూడా ఉపయోగించు కోవాలని అన్నారు. ఈ ఏడాది ఎక్కువ హరిత వనాల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు, వీలైనన్ని చోట్ల అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పండ్ల మొక్కల్లో అడవి మామిడి పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు, కూలీలను హరితమిత్ర అవార్డుకు నామినేట్ చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇకపోతే హరితహారంలో ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునే విధంగా మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిర్ఛయంతో ముందుకు సాగుతున్నారు. గతేడాది వరుణ దేవుడు కరుణించడంతో నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి. ఇందులో భాగంగానే ఫారెస్ట్ నర్సరీలో లక్షల్లో వివిధ రకాల మొక్కల పెంపకం, అలాగే ఈజీఎస్ కింద వివిధ రకాల మొక్కలను పెంచిపోషిస్తున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తున్న కారణంగా హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళామని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేసామన్నారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపడు తున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

## పెద్దమ్మ దేవాలయ వార్షికోత్సవం



కోరుట్ల జూన్ 24 (ప్రజామంటలు): పట్టణంలోని ఐలాపూర్ రోడ్డులో గల పెద్దమ్మ దేవాలయ 13 వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండే ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనిల్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ వార్షికోత్సవంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జిన్న సురేష్, ఉపాధ్యక్షుడు అల్వల శంకర్, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్, గుండవేణి గోపి, పోగుల లక్ష్మిరాజం, పాతర్ల సత్యనారాయణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే జనగామలో దివంగత కవి జంగ వీరయ్య (విత్రీజ) సంస్మరణ సభ



జనగామ జూన్ 24 (ప్రజామంటలు): జనగామలో ఈనెల 25న దివంగత కవి జంగ వీరయ్య (విత్రీజ) సంస్మరణ సభకు సంబంధించిన పోస్టర్ శనివారం జనగామలో విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ రోడ్డు లోగల జనగామ విజయ ఫంక్షన్ హాల్ లో సభ నిర్వహిస్తారు. తెలంగాణ రచయితల సంఘం, జనగామ రచయితల సంఘం, కవులు కళాకారుల ఐక్యవేదిక జనగామ, కవ్వం సాహితి తెలంగాణ నిర్వహణలో కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సభకు తెలంగాణ సాహిత్య అకాడమీ, పూర్వ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ నాళేశ్వరం శంకరం, తెరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ వి శంకర్, కవ్వం సాహితి తెలంగాణ రాష్ట్రం కూకట్ల తిరుపతి, ప్రముఖ సాహిత్య విమర్శకులు సాగర్ల సత్తయ్య, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎర్రోజు శ్రీనివాస్, హనుమకొండ వరంగల్ తెరసం అధ్యక్షులు పొట్లపల్లి శ్రీనివాసరావు, హన్మకొండ వరంగల్ జిల్లాల తెరసం కార్యదర్శి బిల్ల మహేందర్, కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, డాక్టర్ సి.హెచ్. రాజమౌళి పాల్గొంటారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కల్నల్ డాక్టర్మాచర్ల బిక్షపతి,జి.కృష్ణ,సాంబరాజుయాదగిరి, పానుగంటి రామ మూర్తి, అయిలా సోమ నర్సింహచారి, లగిశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్లు

### యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి



జగిత్యాల/ సిరిసిల్ల జూన్ 24 (ప్రజామంటలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరియు జగిత్యాల్ జిల్లాలలో మహిళా కాంగ్రెస్ జిల్లా రివ్యూ మీటింగ్ కు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ముఖ్యఅతిథిగా విచ్చేసినారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మరియు జగిత్యాల్ జిల్లా లో మహిళా కాంగ్రెస్ రివ్యూ మీటింగ్ లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రివ్యూ మీటింగ్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు కాముణి వనిత అధ్యక్షతన జరిగిన రివ్యూ మీటింగ్లో మరియు జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన రివ్యూ మీటింగ్ లో 2 జిల్లాలలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు మాట్లాడుతూ.... జిల్లా కమిటీ సభ్యులతో .మండల కమిటీ మెంబర్లతో . బ్లాక్ ప్రెసిడెంట్లతో. పట్టణ కమిటీ మెంబర్లతో మాట్లాడడం జరిగింది .ప్రతి ఒక్కరూ కమిటీలు మొత్తం పూర్తి చేయాలని ఎన్నికల సమయం కాబట్టి ప్రతి ఒక్కరూ గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ నీ బలోపేతం చేయడానికి కంకణ బద్ధులై ప్రతి ఒక్కరు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సునీత రావు అన్నారు. మహిళా డిక్లరేషన్ ప్రియాంక గాంధీ వచ్చి ప్రకటిస్తారని కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తుందని సునీత రావు అన్నారు.

# షర్మిలను ముగ్గులోకి దింపే యత్నాలు

- కాంగ్రెస్‌లోకి రప్పించి లబ్ధిపొందేలా వ్యూహాలు
- ఎపిలో దింపాలన్న యోచనలో కాంగ్రెస్
- ప్రచారాలను తిప్పికొడుతున్న జగనన్న బాణం



న్యూఢిల్లీ,జూన్24 : ఏపీ పూర్వవైభవం కోసం కాంగ్రెస్ పార్టీ పాకులాడుతోంది. పీసీసీ నేతలను మార్చినప్పటికీ ఆ పార్టీకి ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత మొదటిసారిగా రఘువీరారెడ్డి, ఆ తర్వాత శైలజానాథ్ పీసీసీ బాధ్యతలు చేపట్టారు. అయినా రాష్ట్రంలో కాంగ్రెస్ సత్తా చూపించలేకపోయింది. ప్రస్తుతం గిడుగురాజు రుద్రరాజు చేతిలో ఏపీ కాంగ్రెస్ పగ్గాలున్నాయి. రుద్రరాజు బాధ్యతలు తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ఆర్టీపీ అధినేత షర్మిలను కాంగ్రెస్ చేర్చుకుని పూర్వవైభవం తేవాలని ఆ పార్టీ నేతలు ఆరాట పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే పార్టీని విలీనం చేసే ప్రసక్తి లేదని షర్మిల ఖండిస్తూ వచ్చారు. తన బతుకు అంతా తెలంగాణతోనే అంటూ ట్వీట్ చేస్తున్నారు. అయితే పరిస్థితులు మాత్రం వేరుగా ఉన్నాయి. ఈ ప్రచారం ఇలా జరుగుతున్న తరుణంలోనే రెండు రోజుల్లో షర్మిల ఢిల్లీకి వెళ్తున్నారని సమాచారం. ఈ పర్యటనలో ఆమె కాంగ్రెస్ ముఖ్యనేతలో భేటీ అవుతారని సమాచారం. ఇప్పటికే కార్నాటక ఉప ముఖ్యమంత్రితో డీకే శివకుమార్‌తో షర్మిల భేటీ అయ్యారు. మరుసటి రోజే వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం, షర్మిల మధ్య చర్చలు జరిగినట్లుగా వార్తలు వచ్చాయి. ఏపీలో షర్మిల సేవలను వాడుకునేందుకు వీలుగా వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రతిపాదించారని.. విలీనానికి షర్మిల ఇష్టపడలేదని.. వార్తలు వచ్చాయి. విలీనం లేదా పొత్తు ప్రతిపాదనలపై అటు హైకమాండ్, ఇటు షర్మిలకు మధ్య సమన్వయకర్తగా శివకుమార్ వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, మర్యాదపూర్వకంగానే ఈ భేటీ జరిగిందని పైకి అంటున్నా, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం సాధించే దిశగా వీరిద్దరి మధ్య కీలక చర్చలు జరిగాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఏపీ కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్ర పోషించేందుకు షర్మిల అంగీకరిస్తే, ప్రస్తుతం వైఎస్ఆర్టీపీలో ఉన్న చాలా మంది నేతలు మళ్లీ సొంతగూటికి వచ్చే అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు. షర్మిలను పార్టీలో చేర్చుకుని పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలని హస్తం పార్టీ తలపిస్తోంది. కానీ షర్మిల మాత్రం తన భవిష్యత్తు తెలంగాణతోనేనని స్పష్టం చేస్తున్నారు. తన చివరి శ్వాస వరకూ తెలంగాణ బిడ్డగా.. తెలంగాణ కోసం పోరాడుతూనే ఉంటానన్నారు. ఊహాజనిత కథలు కల్పిస్తూ తనకు, తెలంగాణ ప్రజలకు మధ్య అగాథాన్ని సృష్టించే విఫలయత్నాలు జరుగుతున్నా యని ఆరోపించారు. పనిలేని.. పసలేని దార్శనికులకు తాను చెప్పేది ఒకటేనని, తన రాజకీయ భవితపైన పెట్టే దృష్టిని.. సమయాన్ని కేసీఆర్ పాలనపైన పెట్టాలన్నారు. కేసీఆర్ పాలనలో సర్వనాశనమై పోతున్న తెలంగాణ భవితపైన దృష్టి పెట్టాలని, కేసీఆర్ కుటుంబ అవినీతిని ఎండగట్టాలని సూచించారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరితే.. ఆమె సేవలను ఏపీలో వినియోగించుకుంటామంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. అయితే తన అన్న జగన్‌కు వ్యతిరేకంగా ఆమె ఎపిలో రాజకీయాలు చేస్తారని అనుకోవడం ఉత్తిదే అని అంటున్నారు. ఆఒకవేళ ఆమె కాంగ్రెస్‌లో చేరినా ఆమె పాత్ర తెలంగాణకు పరిమితం అవుతుందని కూడా అంటున్నారు.



జగిత్యాల బ్రాహ్మణ వీధిలోని హరిహరాలయంలో హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం మహిళలచే పవిత్ర ఆషాడమాస ఉత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలంతా తమ చేతులకు వివిధ రకాల డిజైన్లతో గోరింటాకు అలంకరించుకున్నారు. అంతేకాకుండా మహిళలందరూ ఒకే రకమైన రంగు చీరలు ధరించి గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. అంతకముందు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం అల్పాహారం సేవించారు.

## ప్రాజెక్టులపై నెల్లూరు చర్చిద్దాం రా

### లోకేశ్‌కు అనిల్ కుమార్ సవాల్

నెల్లూరు,జూన్24 : టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాద యాత్రపై ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ విమర్శలు గుప్పించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర కాదని.. అదో విహారయాత్ర అని వ్యాఖ్యలు చేశారు. జగన్ పాదయాత్ర చేస్తే ఉదయం నుంచి రాత్రి వరకు చేశారన్నారు. సాయంత్రం 4 గంటలకు కాసేపు నడిచి లోకేష్ కాలయాపన చేస్తున్నారని అన్నారు. లోకేష్ మాట్లాడే ముందు భాష నేర్చుకోవాలని హితవుపలికారు. 'లోకేష్‌కు నిజంగా దమ్ముంటే జిల్లాలో అభివృద్ధిపై చర్చకి రావాలి. సమయం, వేదిక నీ ఇష్టం.. ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎవరి హయాంలో జరిగాయో తెలుసా? జిల్లాలో పెన్నానదిపై సంగం, నెల్లూరు బ్యారేజీలు ఎవరు పూర్తి చేశారో తెలుసా?. నెల్లూరు సిటీలో చర్చిద్దాం.. దమ్ముంటే రా... లోకేష్ అంటూ అనిల్ ఛాలెంజ్ విసిరారు.

## చురుకుగా రుతుపవనాల కదలిక భారీ వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్,జూన్24 : నైరుతి రుతుపవనాల కదలిక చురుకుగా ఉంది. వేగంగా విస్తరిస్తున్నాయి. వీటి ప్రభావంతో శని,ఆదివారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఉత్తర తెలంగాణలోని 8 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీచేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగుతో పాటు వరంగల్, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, రంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. 115.6 నుంచి 204.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. మరో ఏడు జిల్లాల్లో 64.5 నుంచి 115.5 మిల్లీమీటర్ల మధ్య వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా, శుక్రవారం రాత్రి హైదరాబాద్‌తోపాటు పరిసర జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. బండ్లగూడ జాగీర్, రాజేంద్రనగర్, చాంద్రయణగుట్ట, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, కేపీహెచ్‌బీ కాలనీ, నిజాంపేట్, బాచుపల్లి, బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, అల్వాల్, తిరుమలగిరి, బేగంపేట, మారేడ్‌పల్లి, చిలకలగూడ ప్రాంతాల్లో వానకురిసింది. దీంతో పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది.

## సరిహద్దు దాటేందుకు ఉగ్రవాదుల యత్నం

### కాల్పులతో పారిపోయిన ముగ్గురు ఉగ్రవాదులు

శ్రీనగర్,జూన్24 : జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో దేశంలోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నించిన ముగ్గురు ఉగ్రవాదులను సైన్యం అడ్డుకున్నది. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత పూంచ్ జిల్లాలోని గుల్పూర్ సెక్టార్‌లోఉన్న నల్లా ప్రాంతంలో సాయుధులైన ముగ్గురు ఉగ్రవాదులు నియంత్రణ రేఖ దాటేందుకు యత్నించారు. గుర్తించిన సైన్యం.. వారిపై కాల్పులు జరిపింది. ప్రతిగా వారు కాల్పులకు తెగబడటంతో ఓ సైనికుడు గాయపడ్డాడని అధికారులు తెలిపారు. చికటి కమ్ముకోవడంతో ఎల్‌వోసీ దాటడానికి భారీ ఆయుధ సామాగ్రి కలిగిన ముగ్గురు ఉగ్రవాదులు ప్రయత్నించారని చెప్పారు. అయితే సైన్యం వారిని అడ్డుకోవడంతో కాల్పులు జరిపారన్నారు. సైనికులు కాల్పులు జరపడంతో సమీపంలో ఉన్న దట్టమైన అడవుల్లోకి ముగ్గురు ఉగ్రవాదులు పారిపోయారని తెలిపారు. దీంతో ఆ ప్రాంతాన్ని సైన్యం చుట్టుముట్టిందని, ఉగ్రవాదుల కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టామని వెల్లడించారు.

## పంజాబ్ గగనతలంలో పాక్ డ్రోన్ కూల్చివేత

చండీఘడ్,జూన్24 : పంజాబ్ తరన్ తరన్ జిల్లాలో పాకిస్థాన్ డ్రోన్ కలకలం సృష్టించింది. జిల్లాలోని లఖానా గ్రామంలో భద్రతా దళాలు ఆ డ్రోన్‌ను నేలకూల్చాయి. భారత గగనతలంలో ప్రవేశించిన ఆ పాకిస్థానీ డ్రోన్ ను బీఎస్ఎఫ్ బలగాలు పేల్చివేశాయి. ఈ విషయాన్ని బీఎస్ఎఫ్ స్వయంగా ప్రకటించింది. గురువారం రాత్రి పాకిస్థాన్ వైపు నుంచి భారత సరిహద్దుల్లోకి డ్రోన్ రావడం గమనించిన బీఎస్ఎఫ్ జవాన్‌లు.. రాత్రి 9.12 గంటలకు దాన్ని కూల్చేశారు. అనంతరం బీఎస్ఎఫ్ జవాన్‌లు, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టి.. ఇవాళ ఉదయం 8.10 గంటలకు డ్రోన్ శకలాలను గుర్తించారు. కాగా, 22న ఫజిల్కా ప్రాంతంలో కూడా భద్రత దళాలు ఓ డ్రోన్‌ను మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. పక్కా సమాచారంతో ఫజిల్కా జిల్లాలోని జోధావాలా గ్రామం సరిహద్దుల్లో రెండు కిలోల హెరాయిన్, ఓ పాకిస్థానీ డ్రోన్ ను స్వాధీనం చేసుకున్నారు.

## జనగణమన ఆలపించడం ఆనందంగా ఉంది

న్యూయార్క్,జూన్24 : వాషింగ్టన్ డీసీలోని రోనాల్డ్ రీగన్ బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమంలో.. అమెరికా మేటి సింగర్ మేరీ మిల్‌బెన్.. జనగణమణ గీతాన్ని ఆలపించారు. ప్రధాని మోదీ సమక్షంలో ఆమె భారత జాతీయ గీతాన్ని పాడారు. సభకు హాజరైన జనం కూడా తనతో గొంతుకలిపి పాడడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. జనం గొంతుల్లో ఉన్న ఆ అభిమానాన్ని చూడవచ్చు అన్నారు. భారత జాతీయ గీతాన్ని ఆలపించడం సంతోషంగా ఉందని సింగర్ మేఈ మిల్‌బెన్ తెలిపారు. ఇది ఎప్పటికీ మరిచిపోని రోజు అని ఆమె తన ట్విట్టర్‌లో వెల్లడించారు. జనగణమన పాడిన తర్వాత ఆ సింగర్ స్టేజ్‌పై మోదీ కాళ్లకు పాదాభివందనం చేశారు.

## నేడు హైదరాబాద్‌కు జెపి నడ్డా

### నాగర్‌కర్నూలు సభకోసం రాక

హైదరాబాద్,జూన్24 : ఆదివారం తెలంగాణకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నారు. ఈ క్రమంలో పార్టీ వ్యవహారాలను కాషాయ పార్టీ హైకమాండ్ సెట్ చేసే పనిలో పడింది. ఆదివారం ఉదయం పార్టీ ముఖ్య నేతలతో నడ్డా భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నడ్డా పర్యటన ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. భారీగా జనాన్ని సమీకరించేందుకు బీజేపీ ప్రణాళిక రూపొందిస్తోంది. నాగర్‌కర్నూల్‌లో జరిగే బహిరంగ సభలో నడ్డా పాల్గొననున్నారు. ఆదివార్ం మధ్యాహ్నం 12:45 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నడ్డా చేరుకోనున్నారు. మధ్యాహ్నం 1:15 గంట నుంచి 2:30 గంటల వరకు సంపర్క్ సే అభియాన్‌లో భాగంగా ఇద్దరు ముఖ్యమైన వ్యక్తులను నడ్డా కలవనున్నారు. సాయంత్రం 3:00 గంటలకు నోవాటెల్ హోటల్‌కు నడ్డా చేరుకోనున్నారు. సాయంత్రం 4:00 గంటల వరకు నోవాటెల్ హోటల్లోనే నడ్డా బస చేస్తారు. సాయంత్రం 4:15 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి నాగర్ కర్నూల్ సభకు హెలికాప్టర్‌లో నడ్డా బయలుదేర నున్నారు.సాయంత్రం 4:45 నిమిషాలకు నాగర్ కర్నూల్‌కు చేరుకోనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నాగర్ కర్నూల్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో నడ్డా ప్రసంగిస్తారు. సాయంత్రం 6:10 నిమిషాలకు నాగర్ కర్నూల్ నుంచి బయలుదేరి సాయంత్రం 6:40 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు నడ్డా చేరుకోనున్నారు. సాయంత్రం 7:40 నిమిషాలకు ఎయిర్ పోర్ట్ నుంచి తిరువనంతపురానికి నడ్డా బయలుదేరనున్నారు.

## గ్రూప్-4 రాతపరీక్ష హాల్ టికెట్ల విడుదల

హైదరాబాద్,జూన్24 : జులై 1వ తేదీన నిర్వహించనున్న గ్రూప్-4 రాతపరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచారు అధికారులు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు వరకు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు అందుబాటు లో ఉండనున్నాయి. జూలై 1వ తేదీన రెండు సెషన్లలో పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి రెండు గంటల ముందే చేరుకోవాల్సి ఉంటుందని టీఎస్‌పీఎస్సీ అధికారులు సూచించారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్‌కు 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లను క్లోజ్ చేయనున్నట్లు హాల్ టికెట్లలో పేర్కొన్నారు. అయితే అభ్యర్థులెవరూ షూ ధరించి రావొద్దని అధికారులు పేర్కొన్నారు. కేవలం చెప్పులు మాత్రమే ధరించాలని ఆదేశించింది.

# తెలంగాణ బిజెపిలో గందరగోళం

### రాష్ట్రపార్టీ తీరుతో అధిష్టానంలో అసహనం

### హుటాహుటిన ఢిల్లీకి కిషన్ రెడ్డి పయనం

### ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న ఈటెల, రాజగోపాల్ రెడ్డిలు

### నేడు హైదరాబాద్ పర్యటనకు నడ్డా రాక

హైదరాబాద్,జూన్24 : తెలంగాణ బిజెపిలో గందరగోళం కనిపిస్తోంది. ఉన్నవాళ్లు ఉంటారా అన్న అనుమానాలు అధిష్టానాన్ని తొలచి వేస్తున్నాయి. మరోవైపు మొన్నటి వరకు ఊపు కనిపించిన పార్టీలో నైరాశ్యం తాండవిస్తోంది. ఈ క్రమంలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు అదిష్టానం రంగంలోకి దిగింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సడెన్‌గా ఢిల్లీ వెళ్లారు. చాలా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన ఆయన్ని అధినాయ కత్వం ఉన్నఫళంగా ఢిల్లీ రావాలని పిలుపునిచ్చింది. దీంతో షెడ్యుల్డ్ కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని ఆయన ఢిల్లీ వెళ్లారు. ఇప్పటికే అక్కడ ఈటల రాజేందర్, రాజగోపాల్ రెడ్డి ఉండనే ఉన్నారు. మరోవైపు నేడు నాగర్ కర్నూలు పర్యటన కోసం పార్టీ అధ్యక్షుడు నడ్డా హైదరాబాద్ వస్తున్నారు. దీంతో బీజేపీలో ఏం జరుగుతుందో అన్న చర్చ మొదలైంది. తెలంగాణ బీజేపీలో జరుగుతున్న పరిస్థితులను చక్కదిద్దే దుకు బీజేపీ అధిష్టానం రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ హైకమాండ్ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారని సమాచారం. ఢిల్లీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో తన కార్యక్రమాలను కేంద్రమంత్రి రద్దు చేసుకున్నారు. ఇప్పటికే పార్టీ హైకమాండ్ నుంచి బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి పిలుపు వచ్చిన విషయం తెలిసిందే. ఈటల రాజేందర్, రాజగోపాల్ రెడ్డితో పార్టీ హైకమాండ్ భేటీలో కిషన్ రెడ్డి పాల్గొన నున్నారు. హైకమాండ్ పిలుపుతో ఢిల్లీకి ఈటల, రాజగోపాల్ వెళ్లనున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గత కొంతకాలంగా ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ తెలంగాణ రెండు వర్గాలుగా విడిపోయిన పరిస్థితి. ఈ నేపథ్యంలో బండి సంజయ్ వర్గం, ఈటల వర్గానికి దూతగా కిషన్‌రెడ్డిని అధిష్టానం పిలిచినట్లు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు కిషన్‌రెడ్డిని ఉపయోగించుకోవాలని హైకమాండ్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్‌టాపిక్‌గా మారుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ లెక్క మారిపోతున్నట్టు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీలో పరిణామాలపై ఆసక్తి నెలకొంది. 2023లో అధికారం మాదే అంటూ ప్రచారం చేసిన బీజేపీ లీడర్లు కర్ణాటక ఎన్నికల తర్వాత సైలెంట్ అయిపోయారు. అదే టైంలో కాంగ్రెస్ స్పీడ్ అందుకుంది. తెలంగాణలో రాజకీయాలు ఎప్పుడూ లేనంత డైనమిక్‌గా మారిపోతున్నాయి. ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న కాంగ్రెస్ ఒక్కసారిగా రైజ్ అయింది. ఇతర పార్టీల్లో ఉన్న అసంతృప్తులందర్నీ లాక్కునే పనిలో ఉంది. దీంతో బీజేపీలోకి వస్తామని చెప్పిన వాళ్లంతా కమలానికి హ్యాండిచ్చి కాంగ్రెస్‌చేతిలో చేయివేసి వెళ్లిపోతున్నారు. ఇది బీజేపీకి అతి పెద్ద సవాల్‌గా మారింది. వస్తామని చెప్పిన వాళ్లు వెళ్లిపోతే బీజేపీకి పెద్దగా సమస్య లేకపోవచ్చు కానీ... ఉన్న వారిలో చాలా మంది అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం మరింత కంగారు పెట్టిస్తోంది. అందుకే అధినాయకత్వం రంగంలోకి దిగింది. పార్టీలో ఉన్న అసంతృప్తులను పిలిచి మాట్లాడుతోంది. ఎన్నికల సమయంలో ముఖ్య నేతలు జారుకుంటే పెద్ద దెబ్బ బడే ఛాన్స్ ఉందని గ్రహించి దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. బీజేపీలో అసంతృప్త నేతల జాబితాలో మెయిన్‌గా ఇద్దరి పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈటల రాజేందర్, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిలు చాలా రోజులుగా సైలెంట్‌గా ఉంటున్నారు. వీళ్లకు బండి సంజయ్ వర్గానికి అసలు పడటం లేదని బీజేపీలో టాక్ వినిపిస్తోంది. అందుకే వీళ్లు ఎప్పుడో ఒకప్పుడు పార్టీ మారిపోతారని విశ్లేషణలు ఉన్నాయి. అయితే పదే పదే



ఆ ఆరోపణలు ఖండిస్తున్నప్పటికి కూడా ప్రచారం మాత్రం ఆగడం లేదు. దీంతో వాళ్లిద్దర్నీ అధిష్ఠానం పిలించింది. వారితోపాటు కిషన్ రెడ్డిని కూడా అధినాయకత్వం పిలిచింది. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి,చేరికలపై ఆరా తీయబోతున్నట్టు కూడా తెలుస్తోంది. వీటిపైనే కాకుండా పొత్తుల అంశంపై కూడా బీజేపీ అధినాయకత్వం మాట్లాడబోతోందని టాక్ ఉంది. ఇప్పటికే తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో అమిత్‌షా సమావేశమయ్యారు. ఆ సమావేశంలో ఏం చర్చించారో బయటకు తెలియనప్పటికీ తెలంగాణలో బీజేపీ, టీడీపీ కలిసి వెళ్తాయనే వాదన ఉంది. దీనిపై ఏమైనా చర్చిస్తారా అన్న అనుమానం చాలామందిలో ఉంది. అయితే దీనికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లేకుండా ఆ చర్చలు సాధ్యమేనా అన్నవారు ఉన్నారు. మరోవైపు మంత్రి కేటీఆర్ ఢిల్లీలోనే ఉన్నారు. మంత్రులతో సమావేశమవుతున్నారు. కొన్ని రోజులుగా ఈ రెండు పార్టీల మధ్య పెద్ద స్థాయిలో విమర్శలు, ఆరోపణలు వినిపించడం లేదు. లిక్కర్ స్కామ్‌పై కూడా బీజపీ మాట్లాడటం లేదు. ఈ పరిణామాలతో కిషన్‌రెడ్డితోపాటు మిగతా నేతలను అధినాయకత్వం పిలవడం చర్చనీయాంశమైంది.

## చంద్రబాబుతో పొత్తుంటుందని మేము చెప్పామా?

- అమిత్‌షాతో భేటీ తరవాత చంద్రబాబు చెప్పాడా
- మేము వైసిపికి వ్యతిరేకమని వేరుగా చెప్పాలా
- టీడీపీ, బీజేపీ పొత్తు వార్తలపై బీజేపీ అధ్యక్షులు సోమువీర్రాజు



విజయవాడ,జూన్24 : అమిత్‌షాతో బాబు కలిసినంత మాత్రాన పొత్తులు ఉన్నట్టుగా ఊహించుకుంటే ఎలా అని టీడీపీ, బీజేపీ పొత్తుకు సంబంధించి వస్తున్న వార్తలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... టీడీపీ చీఫ్ చంద్రబాబుతో కలిసి బీజేపీ పొత్తుతో వెళుతుందని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. కేంద్రమంత్రి అమిత్ షాతో చంద్రబాబు కలిసినంత మాత్రాన ఎవరిష్టం వచ్చినట్లు వారు ఊహించుకుంటే .. తామెలా చెబుతామని అడిగారు. అమిత్ షాతో భేటీ తరవాత చంద్రబాబు ఎక్కడా ఆ అంశంపై మాట్లాడలేదని తెలిపారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలపై బీజేపీ పార్టీ ముఖ్య నేతలు విమర్శలు చేశారని... ఈ పరిణామాలను ఎలా అయినా ఎవరికి వారు అన్వయించుకోవచ్చన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై మీరు అడగటం సహజం.. నేను చెప్పడం ధర్మమని తెలిపారు. ఈ రాష్ట్రానికి డబుల్ ఇంజన్ సర్కార్ కావాలనేది తన ఆకాంక్ష అన్నారు. ప్రధాని మోడీచేసిన అభివృద్ధి, సంక్షేమం అందరికీ కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని.. చూపాలని అడుగుతున్నామని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ , కాపు ఉద్యమ నేత ముద్రగడలు ఇద్దరూ రాజకీయాల్లో ఉన్నారని... ప్రజా జీవితంలో ఉన్నారని తెలిపారు. వారిద్దరి మధ్య వివాదం... కులపరంగా చూడకూడదని.. కేవలం రాజకీయంగా మాత్రమే చూడాలనేది తన అభిప్రాయంగా సోమువీర్రాజు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతో బీజేపీతో పొత్తు వ్యవహారం హాట్ టాపిక్ గానే ఉంటంది. ఎక్కడుకు వెళ్లినా ఏపీ బీజేపీ నేతలకు ఈ ప్రశ్న మాత్రం మీడియా నుంచి వస్తుంది. కానీ వారికి కూడా సమాధానం తెలియదు. చంద్రబాబు మా పార్టీ పెద్దలను కలిశారు... ఏపీకి అమిత్ షా, నడ్డా వచ్చి వైసీపీని విమర్శించారు...మేమూ వైసీపీ ఒకటి కాదని చెప్పారని సోము వీర్రాజు గుర్తు చేశారు. తర్వాత ఏంటనేది మనం ఆలోచించుకుంటున్నామని సోము వీర్రాజు నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. జగన్ ప్రభుత్వంపై అమిత్ షా, జేపీ నడ్డా విమర్శలు చేశారని.. మరి చర్యలెప్పుడు తీసుకుంటారని చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడు ప్రశ్నిస్తున్న అంశంపై సోము వీర్రాజు ఘాటుగా స్పందించారు. చంద్రబాబు, అచ్చెన్నపై తన వ్యాఖ్యలను విమర్శలుగానో..వ్యతిరేకంగానో చూడొద్దన్న వీర్రాజు దీనిపైనా సోము వీర్రాజు స్పందించారు. వారు బీజేపీని ప్రశ్నిస్తూ.. అలా మాట్లాడినందువల్ల తాము స్పందించాల్సి వచ్చింద న్నారు. తన మాటలను వ్యతిరేకంగానో అనుకూలంగానో చూడాల్సిన అవసరం లేదన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్లనే ఏపీకి నష్టం జరుగుతుందని సోము వీర్రాజు చెప్పుకొచ్చారు. సోము వీర్రాజుతో పాటు పలువురు బీజేపీ నేతలు .. అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అయితే జగన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే సోము వీర్రాజుకు ఎందుకు కోపమని ప్రశ్నించారు. దీనిపై సోము వీర్రాజు.. తన వ్యాఖ్యలను వ్యతిరేకంగానో అనుకూలంగానో చూడవద్దంటున్నారు. వైసీపీతో తాము ఎప్పుడూ దగ్గరగా లేమని వీర్రాజు స్పష్టం చేశారు. ప్రభుత్వ అవినీతిపై అలుపెరగకుండా పోరాడుతున్నామన్నారు. తాము ఏదో ఓ పార్టీకి దగ్గరగా ఉన్నామని చెప్పేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని బీజేపీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. కొద్ది రోజుల కిందట చంద్రబాబునాయుడు ఢిల్లీ వెళ్లి అమిత్ షా, జేపీ నడ్డాలను కలిశారు. అయితే ఆ సమావేశంపై రాష్ట్ర బీజేపీ నేతలకు ఎలాంటి సమాచారంలేదు. అసలు ఆ సమావేశం పొత్తుల గురించేనా అన్నది కూడా తెలియదు. అయితే ఆ తర్వాత రాష్ట్రానికి వచ్చిన బీజేపీ అగ్రనేతలు నడ్డా, అమిత్ షా ఇద్దరూ వైసీపీని విమర్శించడంతో పొత్తులపై చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే టీడీపీ చర్యల కోసం డిమాండ్ చేస్తోంది. అవినీతి జరిగిదని చెప్పడం కాదని.. చర్యలు తీసుకోవాలని అంటోంది.ఈ అంశంపై తరచూ చంద్రబాబు, అచ్చెన్నాయుడు మాట్లాడుతూండటంతో బీజేపీ నేతలు కూడా విమర్శలు చేయడం ప్రారంభించారు. ఇప్పుడు వాటిపై సోము వీర్రాజు.. అవినుకూలమో.. వ్యతిరేకమో కాదని చెప్పడం ద్వారా.. వివరణ ఇచ్చే ప్రయత్నం చేయడం రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

## స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ

### కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ,జూన్24 : రాష్ట్రంలో బీసీ గురుకుల కళాశాలల ఏర్పాటుతో పాటు ఆరోగ్యశాఖలో 1828 స్టాఫ్ నర్సుపోస్టులకు నోటిఫికేషన్ వేయడాన్ని హర్షిస్తూ తెలంగాణలోని పలు జిల్లాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాల వద్ద బీఆర్ఎస్‌వీ ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం 1001గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి అణగారిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే స్ఫూర్తితో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులందరికీ న్యూట్రీషన్ ఫుడ్ ను అందజేస్తూ విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కల్లూరి నవీన్ గౌడ్, మైనం మనోహర్, సాయికుమార్, అరవింద్, మనోజ్ కుమార్, శ్యామ్, పవన్ కుమార్, గణెళిష్, సీహెచ్ శివకుమార్, వి.కిరణ్, ప్రశాంత్, శంకర్, గోపాల్, లింగస్వామి, వెంకన్న, నరేష్, శ్రీశైలం, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బీసీ ప్రభుత్వ డిగ్రీ గురుకుల కళాశాలను మంజూరు చేయడంపై బీ ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో సీఎం కేసీఆర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి తప్పిన ముప్ప

### టైర్ పంక్చరై స్తంభాన్ని ఢీకొన్న కారు

హైదరాబాద్,జూన్24 : బీఆర్ఎస్ తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. కర్ణాటక రాష్ట్రంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కర్ణాటకలోని కార్కళ వద్ద రోహిత్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. శృంగేరి పీఠాన్ని దర్శించుకునేందుకు వెళ్తుండగా మంగళూరు సమీపంలో ముదూరు - నల్లూరు క్రాస్ వద్ద ఎమ్మెల్యే కారు టైర్ ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యింది. దీంతో కారు అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే కారు ప్రమాదం నుంచి ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన కార్కళ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిని మరో వాహనంలో శృంగేరికి పంపించారు. ఎమ్మెల్యే కారు ప్రమాదానికి గురయ్యారని తెలిసి కుటుంసభ్యులు, పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ప్రమాదం నుంచి ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# కెసిఆర్ కుటుంబాన్ని ఓడించడమే లక్ష్యం

### ఆ లక్ష్యం కోసమే బిజెపిలో చేరా

### బిజెపి మెతక వైఖరి అవలంబిస్తే ఆలోచిస్తా

### మీడియాతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి




న్యూఢిల్లీ,జూన్24 : పార్టీ మార్పుపై వస్తున్న వార్తలపై బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ప్రస్తుతం తాను బీజేపీలోనే ఉన్నానని.. ఊహాగానాలను నమ్మవద్దని తెలిపారు. తన అభిప్రాయాన్ని పార్టీ హైకమాండ్‌కు వివరిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందే అని స్పష్టం చేసిన రాజగోపాల్ రెడ్డి..తెలంగాణ ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారని అన్నారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకారం ఇస్తుందని.. అందులో భాగంగానే కేటీఆర్‌కు కేంద్రమంత్రుల అపాయింట్మెంట్ అన్నారు. మంత్రి కేటీఆర్‌కు కేంద్ర మంత్రులు అపాయింట్మెంట్ ఇవ్వడాన్ని భూతద్దంలో పెట్టి చూడాల్సిన అవసరం లేదని రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాను కాంగ్రెస్ లో చేరుతున్నట్టు మీడియా ఎక్కువ చేసి చూపిస్తోందన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా తలుచుకుంటే ఇప్పటికీ తెలంగాణలో బీజేపీని అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత కొంచెం ప్రజల ఆలోచనలో కొంచెం మార్పు వచ్చినట్టు కనబడుతోందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.కేసీఆర్ ను ఓడించాలన్న లక్ష్యంతోనే బీజేపీలో చేరానని.. ఆ లక్ష్యం సాదించడానికి ఎలాంటి నిర్ణయమైనా తీసుకుంటామని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రకటించారు. హైకమాండ్ పిలుపుమేరకు ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టు వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీ మారుతున్నట్లుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు . తాను ప్రస్తుతానికి బీజేపీలో ఉన్నానని.. బీజేపీ విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేయడానికి కాకుండా.. బీజేపీ సాఫ్ట్ గా వ్యవహరిస్తూ ఉంటే. తమ నిర్ణయాన్ని మీడియాకే వెల్లడిస్తామని స్పష్టం చేశారు. రాజగోపాల్ రెడ్డితో పాటు ఈటల రాజేందర్ కూడా ఢిల్లీకి వెళ్లారు. అలాగే .. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కూడా హైకమాండ్ అత్యవసరంగా ఢిల్లీకి పిలిపించింది. దీంతో తెలంగాణ బీజేపీకి సంబంధించిన కీలక నిర్ణయాలను హైకమాండ్ తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ను ఓడించే పార్టీ బీజేపీ మాత్రమేనని చెప్పి రాజగోపాల్ రెడ్డి ఆ పార్టీలో చేరారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. మునుగోడులో ఉపఎ?నిక వచ్చింది. ఉపఎన్నికల్లో ఆయన పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత బీజేపీ కార్యక్రమాల్లో సైలెంట్ గా ఉన్నారు. ఆయనకు పార్టీ పరంగా కూడా పెద్దగా పదవులేం ఇవ్వలేదు. తర్వాత కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ హైకమాండ్ సన్నిహితంగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం పెరుగుతోంది. ఈ కారణంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైలెంట్ గా ఉంటున్నారు. ఆయన సోదరుడు ఎంపీ వెంకటరెడ్డి కూడా బీజేపీలోకి వస్తారని గతంలో ప్రచారం జరిగింది. కానీ మారిన రాజకీయ పరిణామాలతో ఆయన కాంగ్రెస్ లోనే కొనసాగుతానని పదే పదే ప్రకటి?స్తున్నారు. అంతేనా.. తన సోదరుడు కూడా మళ్లీ కాంగ్రెస్ లోకి వస్తారని అగ్రనేతలకు హామీలు ఇస్తున్నారు.. దీంతో రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ లోకి వెళ్తారని విస్తృతంగా ప్రచారం ప్రారంభమయింది. ఈ క్రమంలో ఆయనను హైకమాండ్ ఢిల్లీకి పిలిపించింది.


## ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని పట్టాలు తప్పిన గూడ్స్

లక్నో,జూన్24 : ఒక గూడ్స్ రైలు ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టి పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున బస్సీ పహర్‌పూర్ - రుబ్బాస్ ప్రాంతంలోని రైలు గేటు వద్ద ట్రాలీ ఉన్న ట్రాక్టర్ పట్టాలు దాటేందుకు ప్రయత్నించింది. ఇంతలో అటుగా వచ్చిన గూడ్స్ రైలు దానిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో రైలు ఇంజిన్ వెనుక ఉన్న గూడ్స్ వ్యాగన్ పట్టాలు తప్పింది.కాగా, ఈ ప్రమాదం వల్ల ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న ఆరుగురు గాయపడ్డారు. వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే గాయపడిన వారికి ప్రాణ ముప్పు లేదని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరూ చనిపోలేదని చెప్పారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ సంఘటనా స్థలానికి చేరినట్లు పేర్కొన్నారు. అలాగే పట్టాలు తప్పిన గూడ్స్ రైలు వ్యాగన్‌ను రైల్వే సిబ్బంది సరిచేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# గుంటూరు కారం మూవీ పై హైప్




త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కోసం సిద్ధం

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం గుంటూరు కారం మూవీ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జులై నుంచి మొదలుకాబోతోంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కథ పూర్తిగా మార్చేసి మరల ఫ్రెష్ స్క్రిప్ట్ తో స్టార్ట్ చేస్తున్నారు. అందులో భాగంగా పూజా హెగ్డేని ఈ మూవీ నుంచి తప్పించారు. శ్రీలీల లీడ్ యాక్టర్ అయ్యింది. మీనాక్షి చౌదరి సెకండ్ హీరోయిన్ గా ఎంపికైంది. ప్రస్తుతం ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్ కోసం త్రివిక్రమ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు బల్క్ డేట్స్ కేటాయించి ఏకదాటిగా షూటింగ్ లో పాల్గొనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఈ మూవీ పైన ఎక్స్ పెక్టేషన్స్ గట్టిగానే ఉన్నాయి. మహేష్ బాబు వరుస విజయాలతో దూకుడు మీద ఉండటం. అలాగే త్రివిక్రమ్ కూడా వరుస రెండు బ్లాక్ బస్టర్స్‌తో జోరు చూపిస్తూ ఉన్నారు. ఈ కారణంగా గుంటూరు కారం మూవీ పై హైప్ క్రియేట్ అయ్యింది. ఇక దిల్ రాజు చాలా రోజుల తర్వాత మరల ఈ మూవీ నైజాం ఏరియా డిస్ట్రిబ్యూషన్ రైట్స్‌ని సొంతం చేసుకున్నారంట. ఏకంగా 42 కోట్లకి ఈ రైట్స్ ని దిల్ రాజు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఓ విధంగా ఇది చాలా పెద్ద మొత్తం అని చెప్పాలి. ఈ మధ్య ఆదిపురుష్ తో పాటు మరికొన్ని సినిమా ఆఫర్స్ చేతిలోకి వచ్చినా వదులుకున్న దిల్ రాజు ఈ మూవీ కోసం మాత్రం రిస్క్ చేయడం విశేషం. గతంలో సూపర్ స్టార్ సినిమాలతో దిల్ రాజుకి మంచి లాభాలు వచ్చాయి. ఈ కారణంగానే మహేష్ బాబు స్టోరీ సెలక్షన్ మీద నమ్మకంతో గుంటూరు కారం మూవీ పై ఏకంగా 42 కోట్లు పెట్టడానికి ముందుకొచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఇక సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ సినిమాని వీలైనంత వేగంగా కంప్లీట్ చేసి జక్కన్నతో చేయబోయే సినిమా కోసం సిద్ధం కానున్నారు. ఇక గుంటూరు కారం మూవీ సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఆ సమయానికి అవుట్ పుట్ రెడీ అయ్యే అవకాశం ఉండకపోవచ్చని టాక్. ఈ నేపథ్యం లో త్రివిక్రమ్ సమ్మర్ రిలీజ్ గా ఈ మూవీ ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది.

# మెగా ఫ్యామిలీలోకి పాప

### తండ్రిగా అనుభూతిలో రామ్‌చరణ్

### గేమ్‌ఛేంజర్ షూటింగ్‌కు మరింత సమయం



మెగా ఫ్యామిలీలో అడుగు పెట్టిన మెగా ప్రిన్సెస్ వల్ల ఫ్యామిలీలో చాలా ఆనందం కనిపిస్తుంది. మెగాస్టార్ చిరంజీవి మీడియా ముందుకు వచ్చి మరీ తనకు ఇష్టమైన మంగళవారం తమ ఫ్యామిలీలో పాప అడుగు పెట్టడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇంకా పలువురు మెగా ఫ్యామిలీ మెంబర్స్ తమ ఆనందాన్ని షేర్ చేశారు. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ మీడియా ముందుకు వచ్చి తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఆనందంలో మాటలు రావడం లేదని.. తండ్రిగా అనుభూతిని పొందుతున్నాను అంటూ పేర్కొన్నాడు. ఇక రామ్‌చరణ్ ఈ నెల చివర్లో 'గేమ్ ఛేంజర్' సినిమా షూటింగ్‌లో జాయిన్ అవ్వాల్సి ఉన్నా కూడా పాప పుట్టిన ఆనందంలో ఉన్నాడు. దర్శకుడు శంకర్ మొన్నటి వరకు ఇండియన్ 2 సినిమా షూటింగ్ లో ఉన్నాడు. ఇప్పుడు గేమ్ ఛేంజర్ కోసం రెడీ అయ్యాడు. కానీ రామ్ చరణ్ ప్రస్తుతానికి తాను ఏ షూటింగ్ లో జాయిన్ అవ్వలేను అంటూ చెప్పాడట. దాంతో చరణ్ లేని కొన్ని సన్నివేశాలను ఈ వారం పదిరోజుల పాటు శంకర్ చిత్రీకరించాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. రామ్ చరణ్ ప్రస్తుతం చేస్తున్న గేమ్ ఛేంజర్ మాత్రమే కాకుండా ఆ తర్వాత చేయాల్సి ఉన్నా బుచ్చిబాబు సినిమా కూడా ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ ను ఆగస్టు నుండి మళ్లీ మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. మెగా ప్రిన్సెస్ రాకతో గేమ్ ఛేంజర్ ఎ÷–లాన్ కాస్త చేంజ్ అయ్యింది.. ముందు ముందు మరెన్ని ఛేంజ్ అవుతాయో చూడాలి.

# స్పై...మూవీ ప్రమోషన్‌లో నిఖిల్

### 29న విడుదలకు ముహూర్తం ఖరారు

కార్తికేయ 2 సినిమాతో పాన్ ఇండియా హీరోగా మారిపోయాడు నిఖిల్ సిద్దార్థ్. ఆ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. అంతే కాదు నిఖిల్ రూ.100 కోట్ల క్లబ్లో జాయిన్ అయ్యాడు. ఈ సినిమా తర్వాత 18 పేజెస్ సినిమాతో మరో హిట్ అందుకున్నాడు. అలా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తో మంచి సక్సెస్ రేట్ తో దూసుకుపోతున్న నిఖిల్ తో సినిమాలు చేయడానికి దర్శక నిర్మాతలు సైతం తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలోనే నిఖిల్ ఇప్పుడు పలు ప్రాజెక్ట్స్ తో బిజీ బిజీగా ఉన్నాడు. నిఖిల్.. డెబ్యూ దర్శకుడు గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం స్పైలో నటిస్తున్నాడు. ఈ సినిమా ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ వేగవంత చేసింది చిత్రబృందం. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్ ట్రైలర్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటు న్నాయి. ఇక తాజా విషయం ఏమిటంటే... ఈ సినిమా సెన్సార్ ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి. ఈ చిత్రానికి జీరో కటలస్తో యు/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది సెన్సార్ బోర్డ్. అంతే కాకుండా ఈ సినిమాను చూసిన సెన్సార్ సభ్యులు.. ఈ సినిమాపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇక ఈ సినిమా రన్ టైం 2 గంటల 15 నిమిషాలుగా ఉంది. ఈ చిత్రం నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణం వెనుక దాగిన మిస్టరీ ఆధారంగా రూపుదిద్దుకుంది. నిఖిల్ కు జోడిగా




ఐశ్వర్యామీనన్ నటించారు. ఇటీవల ట్రైలర్ రిలీజ్ కాగా... అందులో భారీ పోరాట ఘట్టాలు యుద్ధ సన్నివేశాలు సినిమాపై అంచనాలు పెంచాయి. 'స్వతంత్రం అంటే ఎవరో ఇచ్చేది కాదు... మనం లాక్కుంటే వచ్చేది' అని ట్రైలర్ చివర్లో రానా చెప్పిన డైలాగ్ హైలెట్గా నిలిచింది. ఇక ఈ చిత్రాన్ని ఈడీ ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై కె. రాజశేఖర్ రెడ్డి నిర్మిస్తున్నాడు. జూన్ 29 వ తేదీన తెలుగు తమిళ్ కన్నడ మలయాళ సహా హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది.

# వర్మ రాజకీయ వ్యూహం

### రాష్ట్ర రాజకీయాలను హీటెక్కించేలా టీజర్

డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ గురించి అందరికి తెలిసిందే. ఒకప్పుడు టాలీవుడ్, బాలీవుడ్లో సూపర్ హిట్ సినిమాలు అందించిన ఆర్జీవీ గత కొన్నాళ్ల నుంచి మాత్రం నా ఇష్టం అంటూ ఏవేవో సినిమాలు చేస్తున్నాడు. అయినా కూడా ఆయన క్రేజ్ తగ్గలేదు. గతంలో ఎలక్షన్స్ సమయంలో లక్ష్మీస్ ఎన్టీఆర్ అనే సినిమా తీసి సంచలనం సృష్టించారు. ఇప్పుడు మళ్ళీ ఎలక్షన్స్ టైంకి మరో పొలిటికల్ సినిమాతో రాబోతున్నాడు. దానికి వ్యూహం అనే టైటిల్ కూడా పెట్టేశాడు. మొన్నటి వరకు ఈ సినిమా నుంచి పోస్టర్స్ రిలీజ్ చేసి.. ఏపీ రాజకీయాల్లో హీట్ ఎక్కించిన ఆర్జీవీ ఇప్పుడు తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇక ఈ టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఎలాంటి డైలాగ్స్ లేకుండా కేవలం కెమెరా ఫ్రేమ్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తోనే ట్రైలర్ నడిచింది. రామ్ గోపాల్ వర్మ.. ఈ టీజర్ని కూడా తన మార్క్ తో తీర్చిదిద్దాడని చూస్తుంటే అర్థం అవతుంది. ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలను హీటెక్కించేలా ఉంది ఈ టీజర్. వైఎస్. రాజ శేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంతో స్టార్ట్ అయిన



టీజర్లో.. జగన్ కుటుంబంలో కన్నీళ్లు, చంద్రబాబు కళ్లల్లో ఆనందం ఇలా ఎమోషన్స్ ను చూపించారు. ఆ తర్వాత జగన్, భారతిల మధ్య అనుబంధం, జగన్ని సీబీఐ అరెస్ట్ చేయడం, అదే సమయంలో భారతి రోడ్డు మీద పడిన బాధలు, పదవి కోసం చంద్రబాబు వెయిట్ చేయడం వంటివి కూడా చూపించాడు. దివంగత నేతలు ఎన్టీఆర్, రాజ శేఖర్ రెడ్డి చిత్రపటాలు కనిపిస్తాయి. అలాగే వైఎస్ ఫోటో ముందు నిలబడి జగన్ భారతి నవ్వుతూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం వంటివి చూస్తారు. దీని వెనుక వ్యూహం ఏంటో వర్మకే తెలియాలి ఇక. టీజర్ చివర్లో జగన్ పాత్రధారి అజ్మల్ చేత అలా ఆలోచించడానికి చంద్రబాబుని కాదు అనే డైలాగ్ చెప్పడం ఈ టీజర్ కు హైలెట్ గా మారింది. అయితే ఈ సిని మాను ఏపీ ఎన్నికలను చేస్తూ.. తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు జగన్ పార్టీకి చెందిన వ్యక్తులే నిర్మాతలుగా వ్యవహరిస్తు న్నారని సమాచారం. త్వరలో ఈ సినిమా రిలీజ్ కానుంది

# సర్ఫరాజ్‌ను ఎంపిక చేయకపోవడంపై ఆగ్రహం



ముంబై,జూన్24 :భారత టెస్టు జట్టు ఎంపికపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఐపీఎల్‌లో రాణించిన వారిని సుదీర్ఘ ఫార్మాట్‌కు ఎంపిక చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను ఎప్పటిలాగే విస్మరించడంపై ఘాటుగా విమర్శిస్తున్నారు. కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తున్న అతడిని విండీస్ టూర్‌కు ఎంపిక చేస్తారని భావించారు. అయితే యశస్వీ, రుతురాజ్‌లను తీసుకున్న సెలెక్టర్లు సర్ఫరాజ్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో 'సర్ఫరాజ్ ఎక్కడ? ఏం జరుగుతోంది?' అని ప్రశ్నిస్తున్నారు.

# అర్ష్‌దీప్ సింగ్,పుజరాలకు దక్కని చోటు

### జట్టు కూర్పుపై గవాస్కర్ పెదవి విరుపు

ముంబై,జూన్24 : వెస్టిండీస్ పర్యటనకు బీసీసీఐ యువకులను ఎంపి చేసింది. దాంతో, ఈ టూర్‌పై ఆశలు పెట్టుకున్న కొందరికి నిరాశే మిగిలింది. వీళ్లలో భారత జట్టు భావి తారగా మాజీలచే ప్రశంసలు అందుకున్న అర్ష్‌దీప్ సింగ్ ఒకడు. టెస్టు, వన్డే జట్టు.. రెండింటిలోకూడా ఈ యంగ్ బౌలర్‌ను సెలెక్ట్ చేయలేదు. జట్టులో చోటు కోల్పయిన అతడికి మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ బాసటగా నిలిచాడు. 'టీ20 బౌలర్‌గా వచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా ఇప్పుడు జట్టులో కీలక పేసర్‌గా మారాడు. అతడిలానే అర్ష్‌దీప్ సింగ్ కూడా అన్ని ఫార్మాట్లలో టీమిండియాకు ప్రధాన బౌలర్ అవుతాడు. ఈమధ్యే అతను కౌంటీ క్రికెట్‌లో ఇంగ్లండ్‌పై సత్తా చాటాడు. అయితే.. ఒక్కోసారి జట్టులో చోటు కోల్పోవడం మంచికే జరుగుతుంది. ముఖ్యంగా బౌలర్లు దేశవాళీలో ఎక్కువ వికెట్లు తీయొచ్చు. ఇప్పుడు అర్ష్‌దీప్ సింగ్ చేయాల్సింది అదే. అతను వరుసగా 5 వికెట్ల ప్రదర్శన చేయాలి. అలా చేస్తే ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ మళ్లీ జట్టులోకి వస్తాడు' అని గావస్కర్ తెలిపాడు. అలాగే విండీస్ పర్యటనకు నయా వాల్ ఛతేశ్వర్ పూజారాపై వేటు సమంజసం కాదని గావస్కర్ అన్నాడు. సోషల్‌మీడియాలో లక్షల్లో ఫాలోవర్స్ లేనంత మాత్రాన అతడిని తొలగిస్తారా? అని సెలెక్టర్లను ప్రశ్నించాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పుజారా తీవ్రంగా నిరాశ పరిచాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో తక్కువ స్కోర్‌కే పెవిలియన్ చేరాడు. దాంతో, సెలెక్టర్లు అతడికి ఉద్వాసన పలికారు. జట్టులో చోటు దక్కకపోవడంతో పూజారా






కీలక నిర్ణయం తీసుకున్నాడు. దులీప్ ట్రోఫీలో పరుగులు సాధించి తన సత్తా నిరూపించుకోవాలని అనుకుంటున్నాడు. సూర్యకుమార్ యాదవ్ కూడా అతడితో కలిసి వెస్ట్ జోన్‌కు ఆడనున్నాడు. విండీస్ టూర్‌లో భారత జట్టు రెండు టెస్టులు, మూడు వన్డేలు, 5 టీ20లు ఆడుతుంది. మొదటి టెస్టు జూలై 12న మొదలవ్వనుంది.

# హాకీ వరల్డ్ కప్ హీరో రాజీవ్ మిశ్రా కన్నుమూత

### అనుమనాస్పద మృతిగా కేసు నమోదు




లక్నో,జూన్24 : భారత జూనియర్ హాకీ వరల్డ్ కప్ హీరో రాజీవ్ మిశ్రాకన్నుమూశాడు. వారణాసిలోని తన సొంత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాజీవ్ రెండు మూడు రోజుల క్రితమే మరణించి ఉంటాడని స్థానికులు అంటున్నారు. అతను నివసిస్తున్న ఇంటిలోంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో, పోలీసులు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేశారు. రాజీవ్ అకాల మరణం భారత హాకీకి తీరని లోటు. అతనొక అద్భుతమైన నైపుణ్యం ఉన్న ప్రతిభావంతుడు' అని రాజీవ్ చిన్ననాటి కోచ్ ప్రేమ్ శంకర్ శుక్లాఅన్నాడు. రాజీవ్ మృతి పట్ల హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టర్కీ సంతాపం తెలియజేశాడు. 46 ఏళ్ల రాజీవ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ఆనందంలో యశస్వి కుటుంబం

### విండీస్ టూర్‌కు ఎంపిక కావడంతో సంబరం

ముంబై,జూన్24 : ఇటీవల ముగిసిన ఐపీఎల్ పదహారో సీజన్ లో దంచి కొట్టిన యశస్వీ జైస్వాల్ ఇప్పుడు పట్టలేనంత సంతోషంతో ఉన్నాడు. వెస్టిండీస్ పర్యటనకు సెలెక్ట్ అవ్వడమే అందుకు కారణం. యశస్వీ టెస్టులకు ఎంపికయ్యాడని తెలియగానే అతడి తండ్రి భూపేంద్ర జైస్వాల్ ఏడ్చేశాడట. ఈ విషయాన్ని యశస్వీ చెప్పాడు. 'నాకు టెస్టు జట్టులో చోటు దక్కిందని తెలిసిన వెంటనే నాన్న ఏడ్చేశాడు. ఆనందతో ఆయనకు కన్నీళ్లు ఆగలేదు. నేను మా అమ్మను ఇంకా కలవలేదు. త్వరలోనే వాళ్లిద్దరినీ కలుస్తా. టెస్టు జట్టుకు సెలెక్ట్ కావడంతో చాలా సంతోషంగా ఉంది. విండీస్ టూర్‌లో నా సత్తా మేరకు ఆడడానికి ప్రయత్నిస్తా. అయితే.. ఒకింత కంగారుగా ఉంది. కానీ, క్రీజులోకి వెళ్లాక నా తరహా గేమ్ ఆడతా' అని యశస్వీ చెప్పుకొచ్చాడు. పదహారో సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన యశస్వీ 14 మ్యాచుల్లో 625 పరుగులు బాదాడు. అందులో 5 హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ ఉన్నాయి. టీ20ల్లో దుమ్మురేపుతున్న యశస్వీ పేదరికం కష్టాలు అనుభవించాడు. కుటుంబంతో కలిసి పానీ పూరీలు కూడా అమ్మాడు. ఎన్ని కష్టాలు వచ్చినా.. క్రికెటర్ అవ్వాలన్న తన కలను మాత్రం మరిచిపోలేదు. అండర్ -19 వరల్డ్ కప్‌లో సంచలన ఆటతో వార్తల్లో నిలిచాడు. ఆపై దేశవాళీ టోర్నీలో పరుగుల వరద పారించాడు. ఈ ఏడాది ఇరానీ కప్‌లో తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ కొట్టాడు. దాంతో, ఒకే మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించిన సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. పీఎల్ 16 వసీజన్‌లో వేగవంతమైన ఫిఫ్టీ బాది యశస్వీ మరోసారి తన సత్తా చాటాడు. అంతేకాదు ముంబై ఇండియన్స్‌పై శతకంతో చెలరేగిన యశస్వీ సింహ గర్జన చేశాడు. దాంతో, అతడిని ప్రపంచ టెస్టు



చాంపియన్‌షిప్ ÷నైల్‌కు స్టాండ్ బై ప్లేయర్‌గా ఎంపిక చేశారు. అయితే.. ఫైనల్లో ఆడే అవకాశం రాలేదు. విండీస్ పర్యటన రూపంలో యశస్వీకి మరో చాన్స్ వచ్చింది. టెస్టు సిరీస్‌లో తన మార్క్ ఆటతో ఆకట్టుకోవాలని ఈ యంగ్‌స్టర్ తహతహలాడుతున్నాడు. విండీస్ టూర్‌లో భారత జట్టు రెండు టెస్టులు, మూడు వన్డేలు, 5 టీ20లు ఆడుతుంది. మొదటి టెస్టు జూలై 12న మొదలవ్వనుంది.

# ఆసియా క్రీడలకు జట్ల ఎంపికలో బిసిసిఐ

ముంబై,జూన్24 : సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు జరగనున్న ఆసియా క్రీడలకు మహిళలు, పురుషుల క్రికెట్ల జట్లను పంపించే ఆలోచనల్లో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. టీ20 ఫార్మాట్‌లో ఆ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. చైనాలోని హాంగ్‌జావూలో ఆసియా క్రీడలు జరగనున్నాయి. అయితే ఆ సమయంలో వరల్డ్‌కప్ ఉన్న నేపథ్యంలో ఆసియా క్రీడలకు పురుషుల బీ బృందాన్ని పంపాలని బీసీసీఐ భావిస్తోంది. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 23వ తేదీ వరకు వన్డే వరల్డ్‌కప్ జరగనున్న విషయం తెలిసిందే. ఆసియా క్రీడలకు ఏ గ్రేడ్ మహిళల క్రికెట్ జట్టును మాత్రం పంపనున్నారు. జూన్ 30వ తేదీ లోగా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌కు క్రికెటర్ల జాబితాను బీసీసీఐ పంపనున్నది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092,PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com